ప్రజాపక్ష

సమీక్ష

మార్చ్ 16 - 31, 2003 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | వెల రు. 5-00

లోపలి పేజీల్లో.....

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, printed and published by
V. Hanumantha Rao
for **Samata Publications**
D.No. 8-3-898/22, Road No.3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

DTP at : Sri Sai Shamili Graphics
Golnaka, Hyd. Ph. 2756 9274

Printed at : Charita Graphics
Chikkadpally, Hyderabad - 020.

సంపాదకీయం :

కరువు ప్రకటనలకు కరువు లేదు

కరువు గురించిన ఉపన్యాసాలకు కరువు లేదు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన, పంపుతున్న నివేదికలకూ కరువు లేదు. ఈ నివేదికలన్నీ దగ్గర పెట్టుకొనిచూస్తే ఒక దానికొకటి ఎంత పొంతన లేకుండాపోయిందంటే కేంద్రానికే అనుమానం వచ్చి సహాయాన్ని బొట్లు బొట్లుగా అందజేస్తుంది. కేంద్ర బృందం రెండుసార్లు వచ్చి వెళ్ళింది. అవి ఎలాంటి నివేదికలిచ్చాయో తెలియదు కాని, కరువు గురించి అద్వాని నాయకత్వంలో ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ ముష్టి మూడు లక్షల 15 వేల టన్నుల బియ్యం చేతిలో పెట్టి పొమ్మంది. ఇన్నిసార్లు ఇన్ని రకాల నివేదికలు పంపి రాష్ట్ర ప్రభుత్వం తన విశ్వసనీయతను పోగొట్టుకొంది. పనికి ఆహార పథకం అమలు పరచిన తీరు గురించి కేంద్రానికి అందిన నివేదికలు పరిశీలించిన తర్వాత రాష్ట్రానికి బియ్యం ఇవ్వటం బూడిదలో పోసిన పన్నీరని కేంద్రం భావించి వుండాలి. అందుకనే నెలకు లక్షా ఐదు వేల టన్నులతో సరిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంతవరకు కేటాయింపుల గురించి ప్రకటనలకు మాత్రం కరువు లేకుండా చేసింది. వాటిని అమలు పరచడానికి నిధులుంటే కదా. కరువు పేరుతో ముఖ్యమంత్రి చేసే హెలికాప్టర్ పర్యటనల చాటున ముఖ్యముగా ఎక్కడికి వెళ్ళినా సాయంత్రానికి తిరిగి వచ్చే ముఖ్యమంత్రి రాత్రిపూట వుండిపోవటం చూస్తే రేపు వోట్లకు కరువురాకుండా ఇప్పటినుంచే ప్రయత్నాలు ప్రారంభించారేమోననిపిస్తుంది. ఇప్పటికి రెండు సంవత్సరాలుగా కరువు పరిస్థితులు రాష్ట్రంలో ఏర్పడ్డాయి. వచ్చే సంవత్సరం కూడా కరువు వస్తే, 'మాకు వోటివ్వమ'ని జనాన్ని ఎలా అభ్యర్థిస్తారు? ముందస్తుగా ఎన్నికలు జరిపించినా ఆశ్చర్యపడనక్కర్లేదు. అయినా పాలక పార్టీ కరువును రాజకీయం చేయటం లేదు. రాజశేఖరుడే ఆ పని చేస్తున్నారు! మధ్యన ప్రజలు మాడిపోతున్నారు. తినటానికి తిండిలేక పోతేమానె, తాగడానికి నీళ్ళు కూడా లేవు. అక్కడక్కడ గోదాముల మీద దాడుల గురించిన వార్తలు వినవస్తున్నాయి. ఇది మరి పెచ్చరిల్లితే దానికి ప్రభుత్వానిదే బాధ్యత. మొత్తం మీద రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి కరువు బారిన పడ్డ ప్రజల నెత్తిన శఠగోపం పెట్టారు.

భారతదేశంలో జాతీయ స్థాయిలో ఆహార భద్రత వుండవచ్చు. కాని కుటుంబ స్థాయిలో ఆహార భద్రత లేనే లేదు... ఆహార భద్రత పోషకాహార భద్రత కానేకాదు....18 నెలల వరకూ బిడ్డకు ఇవ్వాల్సిన పోషకాహారం ఇవ్వకపోతే, దాని ఫలితం జీవితమంతా అనుభవించాల్సిందే. జన్మలో దానిని సాధించలేం. అందువల్ల వచ్చే నష్టం స్థూల జాతీయాదాయంలో మూడు నుంచి అయిదు శాతం వుంటుంది.....జాతీయ ఆహార భద్రత సాధన అనేది వట్టిడొల్ల. ఆ భద్రత రాజకీయ నాయకునికి మాత్రం సంతోషంగా వుండవచ్చు.

- అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధనా సంస్థ, హిందూ, 6.3.2003

"ఎక్కువ వడ్డీ రుణాల స్థానే తక్కువ వడ్డీ రుణాల పథకం, ఎక్కువ వడ్డీ సెక్యూరిటీలను బ్యాంకులనుంచి తిరిగి కొనుక్కోవటం, వాట్ ప్రవేశపెట్టడం వల్ల రాష్ట్రాలకు వచ్చే నష్టాలు, కేంద్ర అమ్మకం పన్ను మీద సీలింగు తగ్గింపు, రిహాబిలిటేషన్ సైన్సు పెన్షన్ పథకానికి నిధులు - వీటిలో ఏ ఒక్కదానికి కూడా జశ్వంత్ బడ్జెట్‌లో ఒక్క రూపాయ కూడా కేటాయించలేదు"

- మాజీ ఆర్థికమంత్రి చిదంబరం, హిందూ 7.3.2003

ప్రపంచ జల వనరులపై ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సర్వేలో మొత్తం 122 దేశాల్లో భారత్ 120వ దేశంగా నాణ్యత లేని నీటిని అందచేసినట్లు తేలింది. నీటి లభ్యతకు సంబంధించిన సర్వేలో 180 దేశాల్లో భారత్ 133వ స్థానాన్ని కలిగి ఉన్నదని, భారత్‌లో ఏడాదికి సగటున 1880 క్యూబిక్ మీటర్ల నీరు మాత్రమే లభిస్తుందని తేలింది.

- ఈనాడు 6.3.2003

"గవర్నరు ఉపన్యాసానికి కృతజ్ఞతలు తెలియజేసే తీర్మానం, రాష్ట్ర బడ్జెట్, ప్రతిపక్షాలన్నీ కలిసి ప్రతిపాదించిన విశ్వాస రాహిత్య తీర్మానం - వేటినీ చర్చింకుండా ఉత్తరప్రదేశ్ శాసనసభ స్పీకర్ ప్రవర్తించటం పార్లమెంటరీ విధానానికి వ్యతిరేకం"

- హిందూ సంపాదకీయం 8.3.2003

దేశమంతా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుతారు. ఉపన్యాసాలు ఇస్తారు. స్త్రీలకు రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి తను సిద్ధంగా వున్నానని ప్రధాని చెప్పవచ్చు. అయితే గత కొద్ది సంవత్సరాల్లో ఈ విషయంలో ఆయన ఏమి చేసారో తెలియదు. స్త్రీల స్థాయి పెంచడానికి ఇదంతా ఏమైనా ఉపయోగ పడేనా? వీసమెత్తు అవకాశమైనా లేదు. సుమారు 30 శాతం మంది పేదరికం రేఖ కింద నివసించే ఈ దేశంలో, స్త్రీలు మరింత దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. 50 సంవత్సరాల తర్వాత కూడా మొగపిల్లలతో పోలిస్తే, వారికన్నా రెట్టింపు మంది ఆడపిల్లలు పుట్టిన అయిదు సంవత్సరాల లోపే చనిపోతున్నారు. 64 శాతం మంది పురుషులు అక్షరాస్యులైతే, స్త్రీలు 40 శాతం మందే. 62 శాతం మంది ప్రాథమిక పాఠశాలకు హాజరవుతుంటే, 43 శాతం బాలికలే పాఠశాలకు వెళ్తున్నారు.

- ఎకనమిక్ టైమ్స్ సంపాదకీయం 8.3.2003

"ప్రత్యక్ష పన్నుల్లో జశ్వంత్ సింగ్ ఇచ్చిన రాయితీల వల్ల రు. 2955 కోట్ల నష్టం జరుగుతుంది. ఇది ఆర్థిక సమస్యలకు దారి తీస్తుంది. ఇప్పటికే చాలా తక్కువగా వున్న స్థూల జాతీయాదాయం - ప్రత్యక్ష పన్నుల దమాషా, ఈ చర్యల వల్ల మరింత తగ్గుతుంది. రాష్ట్రాలకు రాజ్యాంగం ప్రకారం రావాల్సిన పన్నుల వాటా తగ్గుతుంది" ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త జి. తిమ్మయ్య

- ఎకనమిక్ టైమ్స్ 8.3.2003

ద్రవ్య పరిస్థితిని సంఘటితపరచి పటిష్టం చేయటం, ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించడం, మౌలిక సౌకర్యాల కల్పనను వేగిర పరచటం, పెట్టుబడులు పెట్టడానికి అనుకూల పరిస్థితులనేర్ప రచటం- ఇవన్నీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళు - ఆర్థిక శాస్త్రవేత్త ఎం. గోవిందరావు.

- ఎకనమిక్ టైమ్స్ 20.02.2003

"పార్లమెంటు సభ్యుల స్థానికాభివృద్ధి పథకం పేరుతో (ఎంపిఎల్ఎడిఎస్) ప్రతీ సంవత్సరం రు. 1580 కోట్లు ఖర్చు చేస్తారు. అయితే 2000 సంవత్సరం కాగ్ నివేదిక ప్రకారం ఈ మొత్తంలో 35.80 శాతం నిధులు ఖర్చు కాలేదు. లేదా తక్కవగా ఖర్చు అయ్యింది. సమాజంలో అట్టడుగున వున్నవారికి ఈ ఖర్చు తాలూకు ఫలితాలు అందాయా అనే దానికి దాఖలాలు లేవని కాగ్ నివేదిక అంటోంది. 97-98/99-00 నాగాలాండ్ ఆడిట్ నివేదిక ప్రకారం 87 శాతం నిధులు ఖర్చుకాకుండా మురిగిపోయాయి. సామూహిక ఆస్తుల సృష్టిలో ఈ ఖర్చు విఫలమైంది. పథకం అమలులో అనేక అవకవతవకలు చోటుచేసుకొన్నాయి".

- సి. రమేష్ సంపాదక లేఖ, 'హిందూ' 11.03.2003

ఎట్టకేలకు నెల్లూరు జిల్లాకు పెట్టిన పొట్టిశ్రీరాములు పేరు పొట్టినామంతో కనుమరుగైపోయే ప్రమాదానికి తావు కల్పించటం మరింత శోచనీయమైన అంశం.....పి.ఎస్. నెల్లూరు జిల్లా అనేది వ్యవహారనామంగా మిగిలిపోయే అవకాశాలే మెండు. ఒక మహనీయుని పేరు పెడుతూ, పాతపేరుతో జోడించటంవల్ల ఆ నాయకుని పట్ల పరిపూర్ణ మనసుతో వ్యవహరించలేకపోయారన్న నిందకు ఆస్కారం కల్పించటం ఎంతైనా క్షోభ కలిగించే అంశం.... ఇప్పటికైనా దీన్ని సవరించి 'శ్రీ రాములు జిల్లా' గా మారిస్తే బావుంటుంది.

- వార్త సంపాదకీయం 11.03.2003

కరువు - ప్రకృతి శాపమా? పాలకుల పాపమా?

-ఇప్ప వీరన్న

ప్రజా సంక్షేమాన్ని విస్మరించి స్వప్రయోజనాలు, ఆస్థుల రక్షణ, పెంపులకే అధిక ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాల పరిపాలనా విధానాలతో కలిసి, కొంతమేరకే కారణం అవుతున్న ప్రకృతి అననుకూలతాంశాలతో రూపొందిన కరువు ప్రజానీకంపై మరోసారి దాడి చేస్తుంది. గత పదేళ్ళుగా రాష్ట్రానికి కరువుతో విశ్రాంతి లేని అవినాభావ సంబంధం కొనసాగుతుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ తో సహా మరో 11 రాష్ట్రాలు కరువు పీడిత రాష్ట్రాలుగా ప్రకటించ బడగా అక్షరక్రమంలో మొదటిదైన ఆంధ్రప్రదేశ్ కరువు రాష్ట్రాల జాబితాలోనూ అగ్రస్థానంలో కొనసాగు తుంది. దేశంలోని 513 జిల్లాలు దుర్భిక్ష ప్రాంతాలుగా గుర్తించబడగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కరువు జిల్లాలుగా ప్రకటించబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం 1041 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. మొత్తం రాష్ట్రాన్నే కరువు కబళించడం గత పదేళ్ళలో ఇదే మొదటిసారి. గత శతాబ్దంలో 1911, 1918 ల తర్వాత 1972, 1979, 1987లలో సంభవించిన కరువులతో పోల్చదగిందిగా ఈ ఏటి కరువు కనబడుతుంది. దీని ధాటికి ఈ సంవత్సరారంభం నుండి ఈ పాటికే రైతుకూలీల ఆకలి హత్యలు, కరువు హత్యలు, కలిసి శతకానికి చేరుకున్నాయి.

రాష్ట్ర ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, పత్తి, మిర్చి, పసుపు, కంది లాంటి పంటల విస్తీర్ణం కరువు తాకిడి ప్రభావంగా తగ్గిపోయి, దాని ఫలితం దిగుబడులమీద చూపెట్టింది. ఖరీఫ్, రబీ పంటల రాకతో కళకళలాడాల్సిన రాష్ట్ర ప్రధాన వ్యవసాయ మార్కెట్లలో రైతుల కోలాహలమే కనిపించడం లేదు. గ్రామాల్లో నీళ్ల, మేతలకు దూరమై డొక్కలెండిన పశువులు ఎముకల గూళ్ళుగా మారి తయారవ్వడం గుండెల్ని కెలుకుతుంది. కరువు తీవ్రత మరింత పెరుగ బోయే రానున్న నాలుగు నెలలపాటు పశువుల్ని ఎలా రక్షించుకోవాలో అర్థంకాక రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువుల మేతకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. తెలంగాణ జిల్లాల్లో అనేక చోట్ల ఒక్క గడ్డి మోపు ధర 65 నుండి 80 రూపాయల దాక పెరిగిపోయింది. అదీ ఒక్క జత పశువులకు ఒక్క రోజుకు బొటా బొటిగా మాత్రమే సరిపోతుంది. ప్రస్తుత కరువుకాలం పూర్తయి వర్షాలు అందే సమయం దాక, అంటే మరో నాలుగు నెలలపాటు ఒక పశువుల జతను రక్షించుకోవాలంటే దాదాపు 9 నుండి పదివేలు వెచ్చించాల్సి ఉంది. ఇది సన్న, చిన్న కారురైతులకు సాధ్యమయ్యే పనేకాదు. నీరు, మేత సమృద్ధిగా ఉంటే మరో 7, 8 ఏండ్ల పాటు జీవించగల పని, పాడి పశువుల్ని కరువులో బతికించడం కష్టమని గ్రహించిన రైతులకు ఇష్టం లేకున్నా గత్యంతరం లేని పరిస్థితుల్లో కబేళా వ్యాపారులకు అమ్ముకోవడమే పరిష్కార మార్గంగా కనిపిస్తుంది. ఆందోళన కలిగించే విషయ మేమిటంటే ఆరోగ్యవంతమైన పని, పాడి పశువులు మొదలు చెంగు చెంగున గంతులేస్తూ బాల్యమైనా తీరని లేత వయస్సు లేగ దూడలు సైతం కరువుకాటుకు బలైపోతున్నాయి. ఈ నేపధ్యంలో పశుగ్రాసం కోసం గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం, రవ్వవరంలో పశుసంరక్షణ శిబిరంపై రైతులు దాడి చేసిన సంఘటన కరువు తీవ్రతకు అద్దం పడుతుంది. మరొక వైపు పంటలు లేక తిండి గింజల కరువుతో కటకటలాడుతున్న రైతాంగం పొట్టగడుపు కోవటానికి తమ పంట పొలాల్లోని కోడెవయస్సు మొదలు, ఏళ్ళనాటి మహావృక్షాలను కలప వ్యాపారులకు మహా చౌకగా అమ్మేస్తున్నారు. ఇలా నేల కూలుతున్న వేలాది వృక్షాలు పట్టణాల్లోని టింబర్ డిపోలకు చేరుతున్నాయి. ప్రతి రోజు ఈ విధంగా రాష్ట్రం నలు మూలల నుండి రాష్ట్ర రాజధానికి చేరుకుంటున్న కలప లారీల సంఖ్య అయిదారు వందలకు తగ్గదు. విధిలేక జానెడు పొట్ట కోసం రైతులు పాల్పడుతున్న ఈ ధోరణితో పర్యావరణం మరింత ప్రమాదంలో పడిపోయి మరిన్ని భయంకర కరువులను సృష్టిస్తే దానికి బాధ్యత పాలకులదే కాని ప్రజలది కాదు.

ఇదిలా ఉండగా ఒక్కో జిల్లా నుండి గొడ్డూ గోదా, అమ్ముకుని, కొంపా గోడు, పొలం పుట్రా వదిలేసి లక్షలాది వ్యవసాయ రైతుకూలీలు ఉపాధికోసం పట్నాలకు చేరుతున్న వార్తలు గుండెల్ని పిండేస్తున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లా నుండే దాదాపుగా 10 లక్షల మందికి పైగా రైతు కూలీలు వలసలుగా వెళ్ళిన వార్త తీవ్ర ఆందోళణకు గురిచేస్తుంది. తెలంగాణ పల్లె జీవన సంస్కృతిలో భాగం అయిన కల్లు, కల్లుగీత వృత్తిపైన ఆధారపడ్డ గౌడ కుటుంబాలు, కల్లుతాగేవారేలేక ఆదాయం లేని పరిస్థితుల్లో వలసలు పోతున్నారంటే పల్లెలెంతగా ఖాళీ అవు తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎంత దొరికితే అంతే అన్నట్లు, కలో గంజో తాగైనా పొట్టపోసుకుని ప్రాణాలు దక్కించుకుందామని నగరానికి చేరిన గ్రామీణ రైతుకూలీ జనాలకు పట్టణాల్లోనూ చేదు సంఘటనలే ఎదురౌతున్నాయి. సరుకు ధరను సప్లై-డిమాండ్లు ప్రభావితం

చేసినట్లుగా, పట్టణాలపై వలసల వత్తిడి కారణంగా కూలీలకు దొరికే వేతనాలు 25-40 శాతానికి పడిపోయినట్లు చెబు తున్నారు. ప్రతిరోజూ పని దొరుకుతుందనే గ్యారంటీ లేదు. వారంలో పని దొరికే 3, 4 రోజుల కూలీ డబ్బులే వారానికి సరిపెట్టుకోవాల్సిన అర్థాకలి బతుకుల్ని పల్లె జీవులు భరించలేకపోతున్నట్లు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మహిళా వలస కార్మికుల్ని కరువు మరో భయంకర ప్రమాదస్థితిలోకి నెట్టివేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. కూలీ అడ్డాలపై గంటలకొద్ది నిరీక్షించినా పని దొరకని రోజుల్లో, తను బతుకుతూ తన కుటుంబాన్ని బతికించుకోవాలి కాబట్టి ఆకలి బాధతో ఆత్మాభిమానాన్ని చంపుకొని వేశ్యావృత్తిని స్వీకరిస్తున్నారంటే ఈ పాపానికి ప్రభుత్వం బాధ్యత వహించక్కర లేదా?

కరువు కారణంగా నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడి వివిధ జిల్లాలో సాగవుతున్న వేలాది ఎకరాల పళ్ల తోటలపైనా తన ప్రతాపాన్ని చూపెడుతుంది. ముఖ్యంగా తెలంగాణ జిల్లాల్లో సాగవుతున్న చీనీ, నిమ్మజాతి తోటల్ని కరువు కనికరం చూడకుండా కాటేస్తుంది. వరంగల్, కరీంనగర్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో గత కరువులకే అతలాకుతలం అయి 40-50 శాతం వరకు కుప్పకూలిన చీనీ, నిమ్మతోటల సాగు ప్రస్తుత తీవ్రకరువు కారణంగా ఊడ్చుకు పోనుంది. ఎంతో బలమైన వేరు వ్యవస్థలు కలిగి నీటి ఎద్దడిని తట్టుకుని నిలబడే మామిడి తోటలు సైతం కరువుధాటికి కదిలి పోతున్నాయి. ఇపుడిపుడే లేత వయస్సును (6-7) దాటిన మామిడి చెట్లు కరువులో నీటి ఎద్దడిని తట్టుకోలేక ఒక్కో తోటలో పదుల సంఖ్యలో ఎండిపోతున్నాయి. వరసగా అనేక సంవత్సరాలు సైతం వర్షాలు పడకున్నా సమృద్ధిగా కల్లుకురిసే తాటి చెట్లు సైతం ఎండిపోతున్న దృశ్యాలు తెలంగాణ జిల్లాల్లో కనబడుతున్నాయంటే ఇంత భయంకర నీటి కరువు ఏ కరువులోనూ దాపురించలేదు. తాగు నీటి సమస్యతో పల్లెల గొంతులు తడారిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక వేల గ్రామాల్లో మంచినీటి బోర్లు వట్టిపోవడం మూలంగా సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుంది. గ్రామానికి కిలోమీటర్ల దూరానగల వ్యవసాయ బోర్లనుండి మంచి నీటి సేకరణకు గ్రామీణ మహిళలు బారులు కడుతున్న దృశ్యాలు కనబడుతున్నాయి. గ్రామంలో గల ఒకటి, అర బోరు బావులేమైనా పనిచేస్తుంటే మొత్తం గ్రామం అంతా దానిపై విపరీత ఒత్తిడి కారణంగా మహిళల మధ్య తీవ్రమైన ఘర్షణలు మామూలై పోయాయి.

కరువుపై ప్రభుత్వ స్పందన :

రాష్ట్రంలో ఇంతటి భయంకరమైన కరువు తాండవిస్తున్న పరిస్థితుల్లో ప్రజలు, మహిళా సంఘాలు, పోరాట సంస్థలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు పత్రికలు ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తున్న నేపథ్యంలో ఇష్టం లేకున్నా తానూ కష్టంగానైనా కరువును కాదనలేని స్థితికి వచ్చిన పాలక వర్గ పార్టీ అందరితోపాటు తానూ కరువుపాటను పాడటంలో గొంతుకలిపింది. తద్వారా కరువుకు గురైన ప్రజానీకాన్ని, కరువు వ్యతిరేక పోరాట సంస్థల్ని, కరువు ద్వారా రాజకీయ లబ్ధిపొందాలనుకున్న ప్రతిపక్ష పార్టీలను ఆత్మరక్షణలో పడేయగలననే లక్ష్యమే తప్ప, కరువుపైనప్రభుత్వానికి ఆందోళన, ఆవేదనలు ఎంతమాత్రం లేవు. కరువుపై తనకు నిజమైన ఆందోళన ఏమాత్రం లేదనడానికి నిదర్శనం ప్రస్తుత బడ్జెట్ సమావేశంలో గవర్నర్‌ప్రసంగంలో కరువుప్రస్తావనకు సంబంధించిన ముక్క ఒక్కటైనా లేకపోవడమే. ప్రభుత్వం కరువుపై మాట్లాడుతున్న ధోరణి 'పిల్లేడ్వంగ తల్లేడ్చిందన్న' సామెతను గుర్తుతెస్తుంది. రాష్ట్రంలో కరువునెలా ఎదుర్కోవాలో, తాగునీటి సమస్యనెలా గట్టెక్కించాలో, వలసలనెలా నిలువరించాలో, పశువుల్నెలా కాపాడా లో, అనే కీలకాంశాలపై ఈ రోజు వరకు స్పష్టమైన విధాన ప్రకటనేది ప్రభుత్వం ప్రకటించలేదు. ప్రభుత్వానికి కరువు నెదుర్కో వడమంటే బ్యాంకు రుణాల్ని, విద్యుత్ బిల్లుల నిర్బంధ వసూళ్ళను నిలిపివేయడంగా, (దీన్ని వసూళ్లనే నిలిపివేతగా అర్థం చేసుకోరాదు) కరువు పీడిత ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి ముష్టి వేస్తున్నట్లు ఐదో, పదో కిలోల బియ్యాన్ని విదిలించడం (కరువు ప్రభావంతో వేల కుటుంబాలు గ్రామాలు వదిలేస్తుంటే ఇదీ ఒకందుకు ప్రభుత్వానికి మేలే చేస్తుంది.) గా అక్కడక్కడా మచ్చుకు కొన్ని బోర్లను రిపేరు చేయించడం, మండలానికి ఒకటో, రెండో లారీల పశుగ్రాసాన్ని సరఫరా చేసి చేతులు దులుపుకోవడంగా అర్థాన్ని మార్చివేసింది. ఇదేనా కరువునెదుర్కొనే విధానం? ఇది ముమ్మాటికి కానే కాదు. కరువునెదుర్కొవడం అంటే అత్యుత్తమ అతి కీలక పరిష్కారం గ్రామీణులకు పనిదినాల్ని కల్పించి వలసల్ని నివారించడం. ఆవైపుగా ప్రభుత్వ ప్రయత్నం సున్నా. కరువు కాలంలో గ్రామీణులకు పని దినాల్ని వలసల్ని నివారించే ఉద్దేశం లో భాగంగా చేపట్టిన పథకాల్లో యంత్రాల వాడకాన్ని నిషేధించాల్సి ఉన్న ఆచరణలో ఎక్కడా ఆ విధానం అమలు కావడం లేదు. కూలీలే గ్రూపుగా నిర్వహించాల్సిన పనికి ఆహార పథకం, పనిదినాల కల్పనా హామీ పథకాలన్నీ, కాంట్రాక్టర్లే బినామిగా నిర్వహించడంలో భారీ యంత్రాలను విరివిగా ఉపయోగిస్తున్నా అడ్డు చెప్పే అధికారే లేడు.

ఇదిలా వుండగా రాష్ట్రప్రభుత్వం కరువును ఎంతమాత్రం కరువులేకుండా ఎంతో ఔదార్యంతో కూడిన పెద్ద మనసుతో(!) 2370.00 కోట్ల రూపాయలుగా అంచనా వేసి, దీనికి తోడు కేంద్రం మరో 20 లక్షల టన్నుల బియ్యాన్ని అందించి ఆదుకోవాలనే వేడుకోలు జపం చేస్తుంది గానీ, తానేం చేస్తుందో, ఎంత సాయపడనుందో ఎప్పటికీ సాయపడనుందో, ఎలా సాయపడ నుందో అనే విషయాల్ని బయటపెట్టడం లేదు. 'గంతకు తగ్గదే బొంత' అన్నట్లు కేంద్రం వైఖరి సైతం ఇందుకు భిన్నంగా ఏమి లేదు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు 3 లక్షల టన్నుల బియ్యాన్ని, 174 కోట్ల రూపాయల సాయాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించి తన ఔదార్యతను తానూ ప్రదర్శించింది! కరువు ప్రజలపై కేంద్ర రాష్ట్ర

ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న ఔదార్యం ఆయా ప్రభుత్వాల సహజ స్వభావానికి తగ్గదిగానే ఉంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతాంగం నష్ట పోతున్న ప్రతీసారి ప్రభుత్వాల నష్టాల అంచనా జాబితా కాగితాల్లో ఆశలు రేకెత్తిస్తుందేకాని, ఆచరణలో రిక్తహస్తాల సాయం శూన్యంగా వెక్కిరిస్తుంది. గడిచిన 10 ఏళ్ళలో రు. 15.011 కోట్ల మేర కరువు నష్టాన్ని అంచనా కట్టిన ప్రభుత్వాలు, సహాయ పునరావాస కార్యక్రమాల కోసం చేసిన ఖర్చు రు. 1704.05 కోట్లు మాత్రమే. నష్టాల్ని వేల కోట్లలో అంచనా వెయ్యడం సాయాన్ని వందలకోట్లలో అందించడం 'ప్రభుత్వాలకు ప్రజల క్షేమంపై శ్రద్ధ'కు అద్దం పడుతుంది. ఉదాహరణకు గత ఆర్థిక సంవత్సరంలో 925 మండలాలను కరువుగా ప్రకటించి రు. 3883 కోట్ల నష్టాన్ని అంచనావేసి ఖర్చు చేసింది మాత్రం రు. 112.38 కోట్లు మాత్రమే. దీన్నిబట్టి ప్రభుత్వం నుండి ఈ ఏటి కరువుసాయం ఎంతుంటుందో ఎలా ఉండనుందో, ఊహించడం ఏమంత కష్టం కాదు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రజారంగ సంస్థలను వందల కోట్లను కుదించి బహుళజాతి సంస్థలకో, బడా పెట్టుబడిదారులకో అప్పగించేటప్పుడు ప్రదర్శిస్తున్న ఔదార్యం కరువు ప్రజను ఆదుకోవడంలో కరువైతుందీ ప్రభుత్వాలకు. అసలు భారత రైతాంగానికి కరువులోనూ కష్టాలే కాలంలోనూ కష్టాలే. కరువులో తిండి గింజల సమస్యయితే కాలంలో ఆహారోత్పత్తుల అమ్మకమే సమస్య. రెండేళ్ళ కింద దేశవ్యాప్తంగా ఆహారధాన్యాల అమ్మకంలో రైతులుపడ్డ అవస్థలు వర్ణనాతీతం. గిట్టుబాటు ధరేమో కాని పెట్టుబడి ఖర్చులు ముడిపడ్డా అదే పదివేలని రైతులు ఉత్పత్తుల్ని మార్కెట్లో పోస్తే ప్రపంచ మార్కెట్లో ధరలు లేవని' ప్రైవేటు వ్యాపారస్తులు, గిడ్డంగుల్లో ఖాళీ లేదని భారత ఆహార సంస్థల వాళ్లు రైతుల్ని నానా ఇబ్బందులకు గురిచేసారు. నాడు రైతుల ధాన్యాన్ని కొనిపించడంలో ప్రభుత్వం ప్రదర్శించిన తీరుకు, నేటి కరువు రైతులను ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న తీరు ఒకేరకమైంది. కాలాలేవేరు కరువులోనూ, కాలంలోనూ వ్యవసాయ రైతాంగానికి ఆకలి హత్యలు, అప్పుల హత్యలు, ఎటూ తప్పడం లేదు. గొప్పలు పోయి గత ఫిబ్రవరిలో జాతీయ క్రీడల నిర్వహణలో వేల కోట్ల రూపాయల ఖర్చుకు వెనకాడని ప్రభుత్వం - ప్రస్తుత కరువు పరిస్థితి నుండి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి కేంద్రంపై ఆశతో కాలాన్ని దాటిస్తుంది. గత సంవత్స రాంతానికి ఎఫ్.సి.ఐ. గోడౌన్లలో మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు మూలుగుతున్నాయి. నిల్వల నిర్వహణకే ఏటా నాలుగువేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇది వ్యవసాయం గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, వరదల నియంత్రణ లకోసం చేస్తున్న మొత్తం వ్యయంకంటే అధికం. పైగా ఇందులో ఈ సంవత్సర ప్రారంభంలో 20 లక్షల టన్నుల గోధుమ నిల్వలు వినియోగానికి పనికిరాకుండా పోయాయని అధికారులు ప్రకటించారు. మరో దిగ్భ్రాంతిని కలిగించే విషయమేమిటంటే గత నెలలో నిర్వహించిన లెక్కల ప్రకారం కేంద్ర ఆహార సంస్థ గిడ్డంగుల నుండి 3,500 కోట్ల రూపాయల విలువచేసే గోధుమ నిల్వలు అదృశ్యమైనట్లు తేలింది. 'సంవత్సరాలుగా నిర్వహిస్తున్న లెక్కల్లో గణాంకాల తప్పిందం'గా అధికార వర్గం అతుకజెప్పుతుంది. ఎంత విచిత్రం! గోదాముల్లో కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు మూలుగుతూ ముక్కుతున్నా, అవినీతి, పందికొక్కుల పాలవు తున్నా కరువులో కూటికి కోటి కష్టాలను భరిస్తున్న శ్రమజీవిది ఎంతటి దైన్యస్థితి!

కరువు ప్రకృతి వైపరీత్యమా? పాలకుల పరిపాలనల వైఫల్యమా?

'సమాజంలో అలవాటైన కొన్ని నమ్మకాలపై ప్రశ్నలుండవు. అవి స్థిరపడిపోయిన సత్యాలుగా నిలబడిపోతాయి.' కరువు విషయానికి సంబంధించి సమాజంలో ఉన్న అభిప్రాయంకూడా ఇలాగే ఉంది. కరువంటే వర్షాలు పడకపోవడమనే అభిప్రాయం సమాజంలోని నిరక్షరాస్యులతో సహా అక్షరాస్యుల్లోనూ స్థిరపడి పోయింది. దీన్ని ఆసరా చేసుకునే ప్రభుత్వాలు .కరువు వైపరీత్యా లకు ప్రకృతి సంబంధిత వైపరీత్యాలను కారణాలుగా చూపెడుతూ తన పాలనల వైఫల్యాలను కప్పిపుచ్చుకోజూస్తున్నాయి. ప్రభుత్వాలు కరువంటే ఒక సంవత్స రానిదో, లేదా ఒక సమస్యకో సంబంధించిన విషయంగా స్థిర పరచాలని శతదా ప్రయత్నిస్తున్నాయి. కరువంటే వ్యవసాయానికి వర్షాభావానికి ఉన్న సంబంధం మాత్రమే కాదు. కరువంటే, పనిచేసే శక్తి ఉన్నవాళ్ళకి పని దొరకని సమస్య. పని చేసినా పస్తులు తప్పని సమస్య. కరువంటే అరపూటో, పావు పూటగానో మాత్రమే పనిదొరికే సమస్య. కరువంటే ఆకలి సమస్య, అర్థాకలి సమస్య. కరువు కల్తీ విత్తనాల సమస్య ఫలితం. కరువు కరెంట్ కోత, కొరతల ఫలితం. కరువు ఎరువులు, పురుగు మందుల కల్తీల సమస్యల ఫలితం. కరువు వ్యవసాయం లో మౌలిక సౌకర్యాలపై సబ్సిడీ ఉపసంహరణల సమస్య. కరువు సాగు నీటి వ్యవస్థల అభివృద్ధి, నిర్మాణాల్లో కొనసాగుతున్న ప్రభుత్వాల నిర్లక్ష్యాల ఫలితం. కరువు సేద్యంలో సాగునీరు, సస్యరక్షణ, విషయాల్లో సూచనలు, సలహాలిచ్చే శాస్త్రవేత్తల కొరత సమస్య ఫలితం. కరువంటే పెట్టుబడి ఖర్చులైనా ముడిపడని వ్యవ సాయోత్పత్తుల అమ్మకం సమస్య ఫలితం. వెరసి మొత్తం సమస్యల సృష్టికి కారణం అవుతున్న ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల అమలు ఫలితం.

పై సమస్యలన్నింటితో సంబంధం ఉన్న సమస్యగా కరువును మాట్లాడుతున్నామంటె, అందులో ఏ ఒకటో, రెండో లేనంత మాత్రాన ఆ పరిస్థితిని కరువు కాదని చెప్పడానికి వీలులేదు. కాని అందులో ఏ ఒక్క సమస్య కొనసాగుతూన్న నూటికి నూరుపాళ్లు అది కరువు సమస్య గానే చెప్పాల్సి ఉంది. నిజానికి గత కొన్ని శతాబ్దాల కాలంలో వర్షాభావ సమస్య నెలకొన్నది, వేళ్ళమీద లెక్కించ దగినన్ని సార్లే కావచ్చు. అందులోనూ తీవ్రస్థాయి వర్షాభావ పరిస్థితులు (ఈసారివలె) నెలకొన్నిది గత వందేళ్లలో అరడజను సార్లకు మించి లేదు. కానీ స్వతంత్ర్యానంతర 56 ఏళ్ల కాలంలో ఒక్క వర్షాభావ సమస్య మినహా, మనం ప్రస్థావించిన సమస్యలన్నీ వ్యవసాయ రంగాన్ని ఏ ఒక్కసారీ విడిచిపెట్టలేదు. పైగా ఏటేటా

ప్రభుత్వాలు సృష్టిస్తున్న సరికొత్త సమస్యలకు కరువేలేదు. అందుకే ఒకటి రెండేళ్లు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నంత మాత్రాన కరువు, కరువని విలవిలలాడుతున్నామంటే ఈ కరువు సమస్య ఈ యేటిదో పోయినేటిదో కానేకాదు. అనేక సంవత్సరాలుగా పరిష్కరించబడని మౌలిక సమస్యల తీవ్రతారూపంగా అప్పుడప్పుడు తీవ్ర కరువులు పునరావృతం అవుతుంటాయి. మామూలుగా సాధారణ వర్ష పాతమో, లేదా సాధారణ వర్షపాతం కంటె కొద్ది తక్కువగానో వర్షాలు పడ్డా ఆ పరిస్థితి మిగతా అన్ని సమస్యల్ని మరుగుపరుస్తుంది. సాధారణ వర్షపాతం కంటె అతి తక్కువ వర్షపాతం (ఇప్పటి మాదిరి - 39 ఎం.ఎం) నమోదైనపుడు మాత్రం అది మహా కరువుగా రూపొందు తుంది. అప్పుడుగాని మన ప్రభుత్వాలు కళ్ళు తెరవవు.

వర్షాభావ సమస్య ప్రకృతి సమస్యే అని అనుకున్నా, (అలా అనుకోవడం కూడా పొరపాటే. దీనికి సమాజమే బాధ్యత వహించాల్సి ఉంది) దీని పరిష్కారం మన చేతుల్లో లేదని మాటవరకు అనుకున్నా, మిగతా సమస్యలన్నీ సమాజ తప్పుడు పునాది నిర్మాణ సృష్టే. ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొని నిలబడి అభివృద్ధి సాధించడానికి సమాజం తగిన ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఎప్పుడో ఏర్పడింది. జరగాల్సిన ప్రయత్నం ఆవైపుగా జరిగితే కరువుకు పరిష్కారం దొరుకుతుంది కాని, వైరుధ్య పూరిత సామాజికార్థిక నిర్మాణం కారణంగా ఒకవైపు పర్యావరణాన్ని నాశనం చేస్తూ, మరోవైపు దాని ప్రభావంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితిని కరువుకు కారణంగా చూపెట్టినట్లయితే అంతకంటే మూర్ఖత్వం, మూఢత్వం మరొకటి లేదు. ఇప్పుడు ప్రభుత్వాలు చేస్తున్న పని అదే.

నిజానికి మానవ సమాజం ప్రకృతిని శాసించి నియంత్రించ లేకపోయినా ప్రకృతి విసురుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని మనుగడసాగిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు పోయే విధంగా శాస్త్ర సాంకేతిక విషయాల్లోపట్టు సాధించింది. అయినపుడు ఒకటి రెండేళ్ళు వర్షాలు కురవక పోయినా, కరువు సంబంధిత తాగు, సాగునీరు సమస్యను అధిగమించే శాశ్వత విధానాల్ని రూపొందించుకుని అమలు పరచడం ప్రభుత్వాలకు అసాధ్యమైన పనా? అలా శాశ్వత విధానాలను రూపొందించుకుని అమలు పర్చడంలో ప్రభుత్వం వద్ద డబ్బైనా లేక పోవాలి, లేక ప్రభుత్వానికి ఆ లక్ష్యమైనా లేకపోవాలి. రెండింటిలో ఏది కరెక్ట్? ప్రభుత్వానికి డబ్బు లేదనడానికి, డబ్బు రాదనడానికి వీలే లేదు. గత పదేళ్లుగా పన్నులు, అప్పుల రూపంలో ప్రభుత్వం సేకరించిన ధనం ఒకటిన్నర లక్షల కోట్లు. ఇందులో నాలుగవ వంతు ఖర్చు చేసినా నేటి ఈ భయంకర కరువులు కానరానంత దూరతీరాలకు వెళ్ళిపోయేవి.

అదలా ఉంచితే కరువుతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని విశ్లేషించే సమయం, స్థలమూ లేవు గాని, ఒక్క సాగునీటి వ్యవస్థల విషయంలో క్లుప్తంగా నైనా ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించాల్సి ఉంటుంది.

రాష్ట్రం మొత్తం సాగునీటి విస్తీర్ణంలో 35 వేల చెరువుల చిన్ననీటి పారుదల వ్యవస్థల ద్వారా దాదాపు 30 లక్షల 20 వేల ఎకరాలు సాగవుతుంది. గత 7 సంవత్సరాలుగా ఈ వ్యవస్థపై చేసిన ఖర్చు రు. 1042 కోట్లు మాత్రమే. ఈ విధంగా చిన్న నీటి పారుదల రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంలో వ్యవసాయంపై ఆధారపడ్డ 2-3 ఎకరాల భూకమతాలు కలిగి 47 శాతంగా ఉన్న చిన్న సన్నకారు రైతాంగం వ్యవసాయ జీవనాధారం ప్రశ్నార్థకమైంది. మరొకవైపు భారీ నీటిపారుదల ప్రాజెక్ట్ల నిర్మాణానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష పూరిత, కేటాయింపుల్ని చేసింది. రాష్ట్రంలోని మొత్తం 28 భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలకయ్యే ఖర్చు రు. 40.172 కోట్లలో ఇప్పటిదాక చేసిన ఖర్చు రు. 6063 కోట్లని, ఈసారి బడ్జెట్‌లో వీటికోసం కేటాయించింది 1179 కోట్ల రూపాయలని భారీ నీటి పారుదల శాఖామంత్రి కడియం శ్రీహరి మొన్నటి శాసన సభా సమావేశాల్లో సమర్పించిన నివేదికలో తెలియజేయడం ఆ ప్రాజెక్టుల నిర్మాణాలపై ప్రభుత్వానికి గల "పట్టుదలను" సూచిస్తుంది! పైగా ఇంత పెద్ద మొత్తం కేటాయించడం ఇదే మొదటిసారట! ఏ ఏటికాయేడు వ్యయం పెరిగే విషయాన్ని కాస్సేపు మర్చిపోయి ఇదే విధమైన కేటాయింపు లతో ఈ ప్రాజెక్టుల పూర్తికి 28 ఏళ్ళు పట్టవచ్చని నిపుణులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇందులో కొన్ని నిర్మాణాలకు వందకుపైగా ఏళ్ళు కూడా పడు తుందని వాళ్ళు చెబుతున్నారంటే మన ప్రభుత్వాలకు ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో కావలసిన మొత్తం ఇంకా సుమారు 37.471 కోట్ల అవసరం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు 1998-99 సాగునీటి ప్రాజెక్టులకు చేసిన ఖర్చు రు. 8,774 కోట్లు. ఇదన్నమాట, తమది ప్రజాపాలనగా చెబుకుంటున్న ప్రభుత్వాలు గత 47 ఏళ్ళలో సాగునీటికోసం వెచ్చించిన ఖర్చు. బేష్.... ప్రభుత్వాలకు ప్రజా సంక్షేమంపై ఎంత శ్రద్ధో కదా!

శాశ్వత కరువు నివారణలో, నీటిపారుదల విషయంలో అశ్రద్ధ చూపిస్తున్న ప్రభుత్వాలు శాశ్వత కరువు నివారణ పథకం పేరుతో కాంట్రాక్టర్ల కరువు తీర్చే అవినీతి పథకాలను రూపొందించి అమలు పర్చడం ప్రభుత్వ అసలు స్వభావానికి అద్దం పడుతుంది. భూగర్భజలాల్ని అభివృద్ధి పరిచి సాగు తాగునీటి సమస్యను పరిష్కరించవచ్చని ప్రచార ఆర్భాటం, హంగామల నడుమ మూడేళ్ల క్రితం ప్రారంభించిన, నీరు-మీరు కార్యక్రమానికి ప్రభుత్వం చేసిన ఖర్చు అక్షరాల 1650 కోట్ల రూపాయలు. కొంటూరు కందకాల తవ్వకం, చెరువుల్లో పూడిక తీతలు, ఇంకుడు గుంటలు లాంటి కార్యక్రమాలకోసం చేసిన ఇంతపెద్ద మొత్తం ఖర్చులో పెరిగింది భూగర్భ జలాల చార్జ్ కాదు గానీ, కాంట్రాక్టర్ల జేబులు పూర్తిగా చార్జ్ అయ్యాయన్నది జగద్విదితం.

ఇంకుడు గుంటలు భూగర్భంలోకి నీటిని ఇంకించే ఫిల్టర్ బెడ్‌లలాగ పనిచేస్తాయని, అధికారుల తప్పుడు సలహాతో
(మిగత 18వ పేజీలో)

దుర్మార్గపు యుద్ధాన్ని అడ్డుకొందాం

- ఎన్. వేణుగోపాల్

ఇరాక్ మీద, పశ్చిమాసియా మీద, మొత్తంగా ఆసియా మీద, ప్రపంచం మీదనే యుద్ధమేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. యూరప్‌దేశాలను, ఐక్యరాజ్యసమితిని, భద్రతా మండలి సభ్యదేశాలను భయపెట్టి, బెదిరించి, బుజ్జగించి, ఏదో రకంగా యుద్ధానికి ఒప్పించి ఇరాక్‌మీద దాడికి దిగిలని అమెరికా, బ్రిటన్‌లు శత విధాల ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచ ప్రజాభిప్రాయమంతా యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, ప్రజాస్వామిక భిన్నాభిప్రాయం పట్ల ఏ మాత్రం గౌరవం ప్రకటించని అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడు. మొదటిదాడికి ముహూర్తాలు ప్రకటిస్తున్నాడు. యుద్ధం ఇవాళో రేపో మొదలు పెట్టబోతున్నట్టు అమెరికా అధ్యక్షుడు బుష్, రక్షణ శాఖ కార్యదర్శి డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ కాలిన్ పావెల్, బ్రిటన్ ప్రధానమంత్రి, టోనీ బ్లయర్ రోజు రోజూ యుద్ధోన్మాద ప్రకటనలు చేస్తున్నారు. ఈ వ్యాసం అచ్చయ్యే సమయానికి ఇరాక్ మీద వైమానిక నౌనాదళ దాడులు ప్రారంభమయినా కావచ్చు.

యుద్ధోన్మాదుల సన్నాహాలు ఒకవైపు సాగుతుండగానే అమెరికాలోనూ యూరప్‌లోనూ ప్రజల యుద్ధ వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. యూరప్ పాలకవర్గాలలోనూ కొన్ని ముఠాలు కూడా యుద్ధాన్ని వ్యతిరేకిస్తుండగా అట్టడుగు ప్రజానీకంలోని శాంతి కాముకత లక్షలాది మందితో సాగుతున్న ప్రజా ప్రదర్శనల్లో వ్యక్తమవుతోంది. భద్రతామండలిలో యుద్ధతీర్మానానికి అనుకూలంగా ఎనిమిది ఓట్లు సంపాదించడానికి అమెరికా నానా తంటాలు పడుతోంది. తీర్మానం ఓడిపోతుందేమో అనే భయంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టడమే వాయిదావేస్తూ వస్తోంది. భద్రతా మండలిలోని పేదదేశాలకు ఇప్పటికిప్పుడు అప్పులూ, వరాలూ కురిపించి వాళ్ల అనుకూలతను సంపాదించడానికి ప్రయత్నిస్తోంది.

యుద్ధం పట్ల టోనీ బ్లయర్ నాయకత్వంలోని లేబర్‌పార్టీ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరికి ఇంటాబయటా తీవ్రమైన వ్యతిరేకత చెలరేగుతోంది. మంత్రివర్గ సభ్యులు రాజీనామాల హెచ్చరికల దగ్గర ప్రారంభించి పార్లమెంట్‌లో బ్లయర్ మెడలువంచే దాకా అనేక చర్యలు సాగుతున్నాయి.

సామ్రాజ్యవాదుల మధ్య అంతర్గత ఘర్షణల్లో భాగంగానే అయినప్పటికీ భద్రతామండలిలో సభ్యులైన రష్యా, ఫ్రాన్స్, బెల్జియం దృఢమైన యుద్ధవ్యతిరేక వైఖరి తీసుకుంటున్నాయి. తమ తమ దేశాల్లో వ్యక్తమవుతున్న ప్రజాభిప్రాయానికి తలవొగ్గక తప్పనిస్థితి ఆయా ప్రభుత్వాల మీద కనబడుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో అమెరికా అనుకూలతే అధికార రాజకీయార్థిక విధానంగా చలామణీ చేస్తున్న చైనా కూడా పశ్చిమాసియాలో అమెరికా ప్రాబల్యం పెరిగితే అమెరికా హిరణ్యాక్షుడి తరువాతి అడుగు తనమీదనే పడుతుందనే భయంతో యుద్ధాన్ని వ్యతిరేకిస్తుంది. భద్రతా మండలిలో తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయడానికి నిర్ణయించుకుంది. అమెరికా అనుకూలతకూ వ్యతిరేకతకూ మధ్య ఊగిసలాడుతున్న పాకిస్థాన్ కీలకమైన ఓటింగులో పాల్గొనకుండా ఉండాలని నిర్ణయించుకుని యుద్ధవ్యతిరేకత వైపే మొగ్గు చూపింది.

ఈ భిన్న ప్రయోజనాల, భిన్న వైఖరుల నేపథ్యంలో పశ్చిమాసియా రంగస్థలం మీద జరుగనున్న యుద్ధానికి అసలు కారణాలేమిటి? దాని పర్యవసానాలేమిటి? భారత ప్రజలలో యుద్ధ వ్యతిరేకత వ్యక్తమవుతున్నా దాదాపు రాజకీయ పక్షాలన్నీ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నా అధికారిక వైఖరి తీసుకోవడానికి ఎన్‌డిఏ ప్రభుత్వం నిరాకరించడానికి కారణం ఏమిటి? ఎందువల్ల భారతీయులు ఇరాక్ మీద అమెరికా చేస్తున్న యుద్ధ ప్రయత్నాలను నిరసించాలి!

ఇరవయ్యొకటవ శతాబ్దం ప్రారంభమయి మూడు సంవత్సరాలు గడవక ముందే అమెరికా చేస్తున్న రెండవ యుద్ధమిది. ఆఫ్ఘనిస్తాన్ మీద 2001 నవంబర్‌లో ప్రారంభించిన యుద్ధానికి ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత ఎదురైనా అమెరికా, బ్రిటన్‌లు ముందుకే సాగాయి. అడాల్ఫ్ బుష్, టోనీ ముస్సోలినీలుగా మారిపోయినా జార్జిబుష్, టోనీ బ్లెయర్‌లు ఒక అసహాయ పేదదేశంమీద దుర్మార్గమైన దాడికి పాల్పడి వేలాదిమంది అమాయక ప్రజల హత్యాకాండకు విలువైన సంపద నష్టానికి కారణమయ్యారు. అది గడచి ఏడాది తిరగకుండానే వాళ్ళిద్దరూ ఇరాక్‌మీద దాడికి రంగం సిద్ధం చేయడం ప్రారంభించారు. ఏడెనిమిది నెలలుగా సాగుతున్న ఈ సన్నాహాలు ఇప్పుడు మరింత దూకుడుగా మారిపోయి యుద్ధాన్ని ఆమోదించకపోతే ఐక్యరాజ్య సమితిని భద్రతా మండలిని కూడా గుర్తించబోమని అమెరికా బహిరంగంగానే ప్రకటిస్తోంది.

ఈ సన్నాహాల అంతరార్థాన్ని గ్రహించడానికి వంద సంవత్సరాల పశ్చిమాసియా చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలి.

తమ కాళ్ళకింది నేలలో ఆధునిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిఅయిన చమురు నిల్వలు వుండడమే అరబ్బులు పశ్చిమాసియా వాసులు చేసుకున్నపాపం. తొలి సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్‌కు సరిహద్దులలో వ్యూహాత్మకంగా కీలకస్థానంలో ఉండడమే పశ్చిమాసియాదేశాల నేరం. సోవియట్ యూనియన్ పతనమయ్యాక కూడా దక్షిణాసియాను చైనాను తమ అదుపులో ఉంచుకోవడానికి భయపెట్టడానికి ఉపయోగపడగల ఒక భూఖండంగా సామ్రాజ్యవాదులు పశ్చిమాసియాను పరిగణించడమే ఈ సమస్యలకు మూలం. పశ్చిమాసియా ప్రజలు ఇస్లామిక్ మత విశ్వాసాలను పాటించేవాళ్ళు కనుక, తమవికాని మత విశ్వాసాలన్ని మూర్ఖమైనవనో, మూఢమైనవనో, ఆధునికం కానివనో ముద్రకొట్టి అవమానాలపాలు చేసి అణచివేసే శ్వేతజాతి బాధ్యత భుజాల కెత్తుకున్న సామ్రాజ్యవాదానికి పశ్చిమాసియా ప్రజల పట్ల వ్యతిరేకత రెచ్చగొట్టడం సులభమైంది.

చమురు నిల్వల మీద తమ ఆధిపత్యం నిలుపుకోవడానికి అక్కడి రాజులలో, షేక్‌లలో, అమీర్‌లలో, మత పెద్దలలో కొందరిని ఆదరించడానికి తమగుప్పెట్లోపెట్టుకోవడాని, ఎప్పుడూ అభ్యంతరం కనబడని ఆధునిక అమెరికాకు తానెవరినైనా వ్యతిరేకించదల్చు కున్నప్పుడు మాత్రం హఠాత్తుగా వాళ్ళ రాజరికం, మూర్ఖత్వం, ఛాందసం గుర్తొస్తుంది. ఇరాన్‌రాజు రిజా పహ్లవీని పెంచి పోషించింది. అమెరికా షా కు వ్యతిరేకంగా మత ఛాందసుడుగా తానే ఒకప్పుడు ప్రకటించిన ఖోమైనీని ఇరాక్ వ్యతిరేకత వల్ల సమర్థించింది అమెరికా. ఇరాక్‌కి వ్యతిరేకంగా నిన్నమొన్నటి వరకూ దువ్వుతూ వచ్చిన సౌదీ షేక్‌లను ఇవ్వాళ ఛాందసులుగా ప్రకటిస్తున్నది అమెరికా. కనుక అమెరికాకు పశ్చిమాసియాను ఆధునికరించడమో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడమో అసలు ఉద్దేశ్యం కాదు. ఇరవయ్యో శతాబ్ది తొలి అర్థభాగం బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సులు పశ్చిమాసియాను పంచుకోవడానికి ఎటువంటి కుట్రలకు పాల్పడ్డాయో అటువంటి కుట్రలకే గత దశాబ్దం నుంచీ అమెరికా పాల్పడుతుంది. చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్యను ఏర్పరచి, 1973లో మొదటిసారి చమురు ధరలు పెంచి అమెరికా ఆర్థిక వ్యవస్థను ఇబ్బందిపెట్టిన ఇరాక్‌మీద అమెరికా పాలకవర్గాల కసి వయస్సు 30 సంవత్సరాలు. ఇరవయ్యో శతాబ్ది చరిత్రలో తన ఆధిపత్యాన్ని సవాలు చేసిన మొట్టమొదటి కమ్యూనిస్టేతర నాయకుడు సద్దాం హుస్సేన్‌ను ఎట్లాగైనా అధికార పీఠాన్నుంచి దించాలని అత్యంత విశాలమైన సంపన్నమైన చమురు నిల్వలు ఉన్న ఇరాక్‌ను తన కీలుబొమ్మ పాలనలోకి తెచ్చుకోవాలని అమెరికా చేస్తున్న ప్రయత్నాలు 1970ల నుంచీ సాగుతున్నాయి. ఓపెక్ దేశాలకు పోటీగా కువైట్‌ను తయారుచేయడం, శాంతి యుతంగా పరిష్కరించుకోగలిగిన సరిహద్దు సమస్యను యుద్ధం లోకి ఈడ్చి ఇరుదేశాలకు విధ్వంసక ఆయుధాలను అమ్మి ఆరని చిచ్చు రగల్చడం పాలస్తీనా సమస్యలో అరబ్బుల మనోభావాలకు దెబ్బ తగిలేలా స్థానిక గుండాగా ఇజ్రాయెల్‌ను పెంచి పోషించడం కువైట్‌ను రెచ్చగొట్టి దొంగతనంగా ఇరాక్ చమురు క్షేత్రాలనుండి చమురు ఉత్పత్తి చేయించడం వంటి అసంఖ్యాకమైన కుట్రలూ, కుహకాలూ గత మూడు దశాబ్దాలుగా అమెరికన్ చరిత్ర నిండా నిండిపోయాయి. "చమురు ఎంత విలువైనదంటే దానిని అరబ్బు లకు వదిలిపెట్టలేం" అని కిస్సింజర్ మూడు దశాబ్దాల కింద అన్నమాట పశ్చిమాసియా పట్ల అమెరికా విధానానికి భూమిక.

ఈ నైపథ్యంలో చూసినపుడు ఇరాక్ మీద దాడిని అమెరికా బ్రిటన్‌లు చెపుతున్న సమర్థన వాదనలు అన్నీ కూడా బూటకమని తేలిపోతోంది. అమెరికా బ్రిటన్‌లు రెండూ, లేదా ఇవాళ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న ఇతర సామ్రాజ్యవాద దేశాలు కూడా ఇరాక్ చమురు మీద కన్ను వేసివున్నాయి. పశ్చిమాసియాలోని ఇరాక్ భూభాగంలోని చమురు నిల్వలు సౌదీ అరేబియా తర్వాత అతి పెద్ద నిల్వలు. తాజా అంచనాల ప్రకారం 11500 కోట్ల బ్యారల్‌ల నిల్వలున్నాయని, ఇప్పటికీ కనిపెట్టని నిల్వలు బహుశా అంతకు సమానంగా ఉండవచ్చని లేదా ఇరవై అయిదువేల కోట్ల బ్యారల్‌లు ఉండ వచ్చని ఒక అంచనా. ప్రస్తుత ఇరాక్ చమురు ఉత్పత్తి రోజుకు ఇరవై ఎనిమిది లక్షల బ్యారెల్లు మాత్రమే. 1991 యుద్ధానికి ముందు 30 లక్షల బ్యారెల్లుగా వుండేది. ఆంక్షలేమీ లేకపోతే తగినంత పెట్టుబడి వస్తే ఇరాక్ కూడా 5 సంవత్సరాలలో సౌదీ అరేబియాతో సమానంగా రోజుకు 70 నించి 80 లక్షల బ్యారెళ్ల ఉత్పత్తి సాగించగలుగుతుంది. అంటే ప్రపంచ లెక్కలనే మరోరకంగా చెప్పుకోవాలంటే ఇప్పటికి కనిపెట్టిన నిల్వలే ఇరాక్‌ను రానున్న 150 సంవత్సరాలు సంపన్నమైన చమురు ఎగుమతి దేశంగా ఉంచగలుగుతాయి. అంటే ఇరాక్ మీద ఆధిపత్యం సంపాదించే వాళ్ళకి కనీసం వంద సంవత్సరాల లాభాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద అధికారమూ సమకూరతాయన్నమాట.

అసలు కారణాలు ఇవి కాగా ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ నియంతృత్వ పాలన నడుపుతున్నాడని, ఐక్యరాజ్యసమితి ఆంక్షలకు వ్యతిరేకంగా జన విధ్వంసక ఆయుధాలు, రసాయనిక ఆయుధాలు పోగుచేస్తున్నాడని, అనాగరికుడనీ సద్దాం హుస్సేన్ని పదవీచ్యుతుడ్ని చేయడమే తన కర్తవ్యమనీ అమెరికా ప్రకటిస్తోంది. ఈ కారణాలన్నీ సరైనవే అయినప్పటికీ ఆ బాధ్యతను నెరవేర్చడానికి అమెరికాకు ప్రపంచ పోలీసు పెత్తనం ఎవరూ ఇవ్వలేదు. ఈ కారణాలే ఏదైనా ఒక ప్రభుత్వాన్ని పడగొట్టడానికి సరిపోయేవే అయితే ప్రపంచంలో నిలచి ఉండగలిగే ప్రభుత్వం ఒక్కటీ లేదు. ఈ కారణాల మీద ప్రభుత్వాన్ని పడగొట్టవలసే మంటే అందరికన్నా ముందు ఆ శిక్ష పడవలసింది అమెరికా ప్రభుత్వానికీ, అమెరికా పాలకవర్గాలకే.

సద్దాం హుస్సేన్ దేశంలోనే విభిన్న జాతులమీద ముఖ్యంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన కుర్దుల మీద దారుణమైన దమన కాండను సాగించిన మాట నిజమే. అమెరికా వ్యతిరేకతతో మొత్తం గా సామ్రాజ్యవాద వ్యతిరేకతలో ప్రగతిశీలమైన వైఖరి తీసుకుంటున్న

ప్పటికీ అంతర్గత వ్యవహారాలలో దేశీయ పాలనా విధానాలలో సద్దాం హుస్సేన్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నమాట నిజమే. కాని ఆ కారణం మీద సద్దామ్‌ను పదవిలోంచి దించడానికి అమెరికాకు ఉన్న నైతిక అర్హత ఏమిటి? రాజకీయాధికారం ఏమిటి? తమ దేశ ప్రజలపట్ల ఇతర పేద దేశాల ప్రజలపట్ల సరిగ్గా అటువంటి వైఖరినే ప్రదర్శిస్తూ అమెరికా ప్రభుత్వం సద్దాం హుస్సేన్‌ను శిక్షిస్తాననడం క్రూరమైన పరిహాసం.

సద్దాం హుస్సేన్ ఇరాక్‌లో జన విధ్వంసక ఆయుధాలను జీవ రసాయనిక, ఆయుధాలను పెద్ద ఎత్తున పోగుచేసాడని వాటిని ధ్వంసం చేయించడానికే ఐక్యరాజ్యసమితి చేత తీర్మానాలు చేయిస్తున్నానని అందుకే తాను దాడిచేయదలిచానని అమెరికా వాదిస్తున్నది. ఈ వాదనకు మూడు స్థాయిలలో జవాబులున్నాయి.

విధ్వంసక ఆయుధాల మాటకే వస్తే అందరికన్నా ఎక్కువ విధ్వంసక ఆయుధాలున్నది అమెరికా దగ్గరే. ప్రపంచాన్ని కొన్ని డజన్లసార్లు భస్మీపటలం చేయగల విధ్వంసక శక్తిని పోగుచేసుకుంది అమెరికా. హిరోషిమా, నాగసాకి లనుండి ఇవాల్టి దాకా భూగోళం నిండా అత్యంత ప్రమాదకర, జన విధ్వంసక ఆయుధాలను ప్రయోగించింది అమెరికా. నేలమాద, సముద్రం మీద సరిపోనట్టు ఆకాశయుద్ధపు పథకాలు రచించింది అమెరికా. తాను ఆయుధాలు పోగుచేసుకోడం మాత్రమే కాదు. ప్రపంచానికంతా ఆయుధాలు అమ్మిన బహుళజాతి సంస్థల స్థావరం అమెరికా. చివరికి ఇరాక్ దగ్గర ఏ ఆయుధాలు వున్నాయని ఆరోపణ చేస్తున్నదో ఆ ఆయుధాలనూ, ఆ ఆయుధాలను తయారుచేసే ముడిసరుకులను అమ్మింది అమెరికాయేనని సాక్ష్యాధారాలు రుజువుచేస్తున్నాయి. కనుక ఆయుధ విధ్వంసమే అసలు లక్ష్యమైతే ఐక్యరాజ్యసమితి అయినా, భద్రతామండలి అయినా మొట్టమొదట దాడి చేయవలసింది ఇరాక్‌మీద కాదు. అమెరికా మీద.

ఇరాక్ ఇటువంటి ఆయుధాలు పోగుచేయకూడదని 1991 యుద్ధం తర్వాత ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. కనుక ఆ తీర్మానాన్ని అమలు చేయించడమే తన బాధ్యత అని అమెరికా వాదిస్తోంది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలమీద అమెరికాకు ఇంత గౌరవం ఎప్పట్నుంచీ కలిగిందో, చరిత్ర తెలిసినవాళ్ళు నవ్విపోతారు. 1947 నుంచీ ఇప్పటివరకూ ఇజ్రాయెల్ లక్ష్యపెట్టని, ఉల్లంఘించని ఐక్యరాజ్యసమితి తీర్మానాలు కోకొల్లలు. ప్రతి ఒక్క సందర్భంలోనూ తన వీటో శక్తితో ఇజ్రాయెల్ ఉల్లంఘనలకు అండగా నిలబడింది అమెరికా. ఇప్పటికిప్పుడు కూడా తన యుద్ధోన్మాదాన్ని సమర్థించక పోతే ఐక్యరాజ్యసమితిని ఖాతరు చేయబోనని బహిరంగంగా ప్రకటిస్తున్నదంటే ఐక్యరాజ్యసమితి మీద ఉన్న గౌరవం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

ఇంతకూ 1991 తర్వాత ఇరాక్ మీదనే ఆంక్షలు ఎందుకు విధించవలసి వచ్చింది? కువైట్‌పై దురాక్రమణలో 1990లో ఇరాక్ తప్పుచేసిన మాట నిజమే కావచ్చు. అప్పుడు జరిగిన యుద్ధంలో ఇరాక్ దురాక్రమించిన భూభాగం వదిలిపెట్టి వెనక్కి వెళ్ళిపోయింది. ఆ తర్వాత కూడా సద్దాం హుస్సేన్‌పై కక్షతో అమెరికా, బ్రిటన్‌లు ఐక్యరాజ్యసమితిని బలవంతపెట్టి ఆంక్షలు విధింపజేశాయి. ఏ దేశానికైనా ఎంత రక్షణ వ్యయానికి వెచ్చించాలో ఏ ఆయుధాలు పోగు చేసుకోవాలే అంతర్గత రాజకీయార్థిక విధానాలు నిర్ణయిస్తాయి. అది ఆ దేశ శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేసే సామ్రాజ్యవాదుల క్రీడలో భాగం కాకూడదు. సద్దాం హుస్సేన్ మీద కసి తీర్చుకోవడానికి సద్దాం హుస్సేన్ పట్ల ఇరాకీయులలో వ్యతిరేకత రెచ్చగొట్టడానికి నిత్య జీవితావసరాల దిగుమతుల మీద కూడా ఆంక్షలు విధించారు. ఆయుధాల తయారీకి ఉపయోగపడుతాయన్న పేరుతో ఎన్నెన్నో సరుకుల దిగుమతులపై ఆంక్షలు విధించారు. జీవ, రసాయనిక ఆయుధాల తయారీకి ఉపయోగపడతాయనే పేరుతో మందుల దిగుమతిపై ఆంక్షలు విధించారు. మందులు లేకపోవడంవల్ల 91 నుంచి 97 వరకూ 5 లక్షల మంది పిల్లలు చనిపోయారని మొత్తంగా మందులు లేకపోవడం వల్ల 12 లక్షల మంది ఇరాకీయులు చనిపోయారని ఐక్యరాజ్యసమితి 1977లో ప్రకటించింది. ఈ హత్యాకాండ నివేదికవిని అమెరికా ఆంతరంగిక కార్యదర్శి మెడలిన్ ఆల్‌బ్రైట్ "ఇది తగిన మూల్యమ్" అని వ్యాఖ్యానించింది. కనుక ఒకవేళ ఆంక్షలను ధిక్కరించి ఏమైనా చేసివున్నా అది సహజన్యాయ సూత్రాలకు లోబడే చర్యే. అయినా ఐక్యరాజ్యసమితి నియమించిన ఆయుధ తనిఖీ బృందాలు ఇరాక్‌లో జన విధ్వంసక ఆయుధాలను ధ్వంసం చేయడం జరిగిందనీ, జీవ రసాయనిక ఆయుధాలు తయారవుతున్న జాడ లేదని ఇప్పటికి కనీసం అరడజనుసార్లు నివేదికలు ప్రకటించారు.

ఈ వాస్తవాలతో అమెరికాకు సంబంధం లేదు. ప్రపంచ ప్రజాభిప్రాయంతో సంబంధం లేదు. సామ్రాజ్యవాద కూటమిలోనే వ్యక్తమవుతున్న వ్యతిరేకతపట్ల గౌరవం లేదు. తోడేలు, మేక కథలు లాగా మేక నేరం చేసినా చేయకపోయినా, నీళ్ళు ఎంగిలి చేసినా చేయకపోయినా ఏదో ఒక సాకుతో మేకను చంపవలసిందే. చరిత్రలో ఏ యుద్ధానికైనా కారణాలు హాస్యాస్పదమైనవో, స్వార్థపూరితమైనవో కావచ్చుకానీ ఇప్పుడు జరుగుతున్న యుద్ధం వంటి నిష్కారణమైన హాస్యాస్పదమైన స్వార్థపూరితమైన కారణాలు మరెప్పుడూ వుండి వుండవు.

శాంతికాముక ప్రజలు కానీ, ఒకప్పటి అలీనోద్యమానికి నాయకత్వం వహించిన దేశ పౌరులుగా తోటి మూడవ ప్రపంచ దేశ పౌరులుగా ఇరాక్ పై ఈ దురాక్రమణ పూరిత, దుర్మార్గమైన యుద్ధాన్ని వ్యతిరేకించడం భారతీయుల కర్తవ్యం. ఇది కేవలం యుద్ధపు విషకోరలలో చిక్కుకుని ప్రాణాలను, భద్రతనూ సంపదనూ పోగొట్టుకోనున్న ఇరాక్ ప్రజలకు అండగా నిలబడడమే కాదు, ఇవ్వాల్టి వంతు ఆహారం ముగించి రేపు మనమీద పడనున్న బకాసురుడి అసలు రంగు గుర్తించి ఈ దురాక్రమణను ఆపడానికి చేయవలసిన ప్రయత్నం. ❑

రాష్ట్ర వ్యవసాయరంగంలో అభివృద్ధి ధోరణులు

- ఎస్. సుబ్రమణ్యం

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పరిస్థితి అధ్యయనాన్ని నాలుగు కాలాలుగా విభజించవచ్చు. 1) సస్య విప్లవం పూర్వం, 2) సస్య విప్లవం తర్వాత 1970 దశకం ఆఖరువరకు, 3) 80వ దశకం, 4) సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత 90వ దశకం. అదే సమయంలో మొత్తం రాష్ట్రాన్ని అయిదు శీతోష్టమండలాలుగా (ఈ వ్యాసపత్రానికి సంబంధించినంతవరకు) 1) ఉత్తర కోస్తా ఆంధ్ర, 2) దక్షిణ కోస్తా ఆంధ్ర, 3) రాయల సీమ, 4) దక్షిణ తెలంగాణా 5) ఉత్తర తెలంగాణాలుగా విభజించి వ్యవసాయ రంగంలో పరిమాణాలను, పురోగతిని సమీక్షించవచ్చు. మొత్తంగా చూస్తే దేశంలో 80వ దశకంలో వ్యవసాయం ఉచ్ఛదశ నందుకొందని చెప్పవచ్చు, 90వ దశకం తిరోగమన దశకంగా తయారైంది.

సస్యవిప్లవం మొదటి దశ (70వ దశ ఆఖరు వరకు)

సస్యవిప్లవానికి పూర్వం 1.9 శాతం ఉత్పత్తి అభివృద్ధి రేటు సస్య విప్లవం మొదటి దశలోనే సంవత్సరానికి 3.5 శాతం చొప్పన ఎగిసింది. అన్ని తిండిగింజల ఉత్పత్తిలో అభివృద్ధి ఈ పెరుగుదలకు కారణం ఉదాహరణకు బియ్యం 3.6 శాతం, పప్పుధాన్యాలు 3.2 నుంచి 8.1 శాతం, చిరు ధాన్యాలు 1.8 నుంచి 7.1 శాతం ఉత్పత్తి అభివృద్ధి రేటు సాధించాయి. అయితే, పత్తితప్ప, ఆహారేతర పంటల అభివృద్ధి మాత్రం సంతృప్తికరంగా లేదు.

సస్యవిప్లవం రెండవ దశ (80వ దశకం)

ఈ దశలో పెరుగుదలలో వేగం సాధించలేకపోయినా గత దశకంలో అభివృద్ధి రేటును నిలబెట్టడం జరిగింది. ఇదికూడా ఉత్పాదకతను గత దశకం స్థాయిలో కొనసాగించటం ద్వారా కాక తక్కువ ధరపలికే కాయధాన్యపంటల నుంచి ఎక్కువ విలువగల నూనె గింజలు, పత్తి, పప్పు ధాన్యాల పంటలకు పంట మార్పిడి ద్వారా సాధ్యమైంది. అయితే చిరుధాన్యాల క్రింద స్థూల పంట పొలాల విస్తీర్ణం తగ్గింది. కాని, పైన చెప్పినట్లు నూనె గింజలు 12 నుంచి 21 శాతానికి, పత్తి 3 నుంచి 4.5 శాతానికి పెరిగింది. ఈ పంట మార్పిడులవల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి సంవత్సరం చివర 3.6 నుంచి 2.2 శాతానికి తగ్గగా, ఆహారేతర పంటల ఉత్పత్తి 2.8 నుంచి 5 శాతానికి పెరిగింది. బియ్యం ప్రధానంగాపండే ప్రాంతాలు, అలాగే పంటమార్పిడి జరిగిన ప్రాంతాల్లో ఉత్పత్తి పెరుగుదల ఇతర ప్రాంతాల కన్నా ఎక్కువగా వుంది. మొత్తం మీద చూస్తే, దేశంలో లాగే రాష్ట్రంలో కూడా పెద్దగా పెరగనూలేదు. విస్తృతంగా విస్తరించనూ లేదు. మరో మాటలో చెప్పాలంటే తక్కువ విలువగల పంటల నుంచి ఎక్కువ విలువగల పంటలకు మార్పిడీ జరిగిన దశకంగా భావించవచ్చు.

90వ దశకం

90వ దశకంలో, అంటే సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత దేశం అంతటిలోలాగే రాష్ట్రంలో కూడా పెరుగుదల తీవ్రంగా పడిపోయింది. బియ్యం సాలుసరి పెరుగుదల రేటు 3.4 నుంచి 2.3 శాతానికి తగ్గింది. అలాగే సాలుసరి బియ్యం ఉత్పత్తి పెరుగుదల రేటు 3.3 నుంచి 1.6 శాతానికి దిగజారింది. వేరుశనగ కూడా 5.2 నుండి 1.9 శాతానికి, పత్తి 8.1 నుంచి 7.4 శాతానికి తగ్గింది. ఇలా పడిపోవడానికి కారణం ఉత్పాదకత తగ్గటమే. ఉదాహరణకు బియ్యం ఉత్పాదకత 3.1 నుంచి 1.3 శాతానికి, పత్తి 3.4 నుంచి 1.4 శాతానికి పడిపోగా, వేరుశనగ పెరుగుదల రేటు తక్కువ స్థాయిలో 0.7 శాతం దగ్గరే వుండిపోయింది. చెరకు 3.2 నుంచి 1.0 శాతానికి తగ్గింది. పంట భూమి విస్తీర్ణం ఈ దశకంలో పెరిగినా, పెరుగుదలరేటు తగ్గింది.

ప్రాంతీయ అసమానతలు

హెక్టారుకు ఉత్పత్తి విలువ, తలసరి ఉత్పత్తి విలువ ఆధారంగా వ్యవసాయంలో ప్రాంతీయ అసమానతలను బేరీజు వేయటం జరిగింది. 1998-99లో దారిద్రరేఖ ఆదాయం కొలమానంగా తీసుకుంటే ఆ సంవత్సరంలో గ్రామీణ తలసరి దారిద్రరేఖ ఆదాయం రు. 3900 లేదా అయిదు మంది కుటుంబానికి రు. 19,500 అదే సమయంలో హెక్టారుకు సగటు ఉత్పత్తి విలువ ప్రస్తుత ధరల ప్రకారం 1998-99 సంవత్సరంలో ఆఖరైన మూడు సంవత్సరాల కాలంలో సగటు రు. 19500. దీనర్థం రాష్ట్రంలో అయిదు గురు సభ్యులున్న కుటుంబానికి ఒక హెక్టారు భూమి వుంటే, ఆ కుటుంబం పేదరికపు రేఖ కింద ఉందన్నమాట. ఈ కొలమానాలతో చూచినపుడు దక్షిణకోస్తా ఆంధ్రలో ఉత్పాదకత 96-99 మధ్య రాష్ట్ర సగటుకన్నా 49 శాతం అధికంగా వుండగా, దక్షిణ తెలంగాణా చాలా తక్కువగా రాష్ట్ర సగటు కన్నా 40 శాతం తక్కువగా ఆఖరు స్థానంలో వుంది. ఉత్తర తెలంగాణా రెండవ స్థానంలో, ఉత్తర కోస్తా ఆంధ్ర మూడవ స్థానంలో వుండగా రాయలసీమ, దక్షిణ తెలంగాణా రాష్ట్ర సగటు కన్నా 29 మరియు 40 శాతం తక్కువగా వుండి ఆఖరు స్థానాల్లో వున్నాయి. ఒక్క దక్షిణ కోస్తా ఆంధ్రలోనే ఒక హెక్టారు సగటు భూమి కలవారే

(మిగతా 12వ పేజీలో)

నీరు - రివర్స్‌గేర్

- భూపతిరాజు సాంబశివరాజు

వీడెవడండి రివర్స్‌గేర్ అంటున్నాడు, అంతా ఫార్‌వర్డ్ గేర్‌లో, టాప్‌గేర్‌లో హైటెక్‌తో లబోదిబోమంటుంటే, 'నీరు-రివర్స్ గేర్' అంటూన్నడేమిటని నిందించకండి.

మన పాలకులు, ఏలికలు చెప్పే మాటల మూటలు విప్పితే కాని నీటి వ్యవహారంలో హైటెక్ స్పీడంతా చెల్లదని, టాప్‌గేర్‌లో ముందుకురికితే పడిపోయేది ఎడ్రస్‌లేని అగాధంలోకేనని తెలిస్తే రివర్స్‌గేర్ ప్రాముఖ్యత గుర్తించగలుగుతారు.

నీటి గురించి పాలకుల మాటలే కాక ప్రజా సంక్షేమం కోరే విజ్ఞులెందరో చెబుతున్న విషయాలుకూడా మనం గమనించాలి. ఉదాహరణకు ముఖ్యంగా నగరాలలో, పట్టణాలలో నివసించే విభిన్న వర్గాల ప్రజల నీటి వినిమయ పద్ధతులను, సంస్కృతిని, వారు వాడుతున్న నీటి పరిమాణ నిష్పత్తులను లెక్క కట్టాలి. నీటి సరఫరా పద్ధతులు, అందులో జరిగే అవకతవకలు, వృధా ఉపయోగించే టెక్నిక్స్, ఇవన్నీ కూలంకషంగా అధ్యయనం చేస్తేనే గాని నిజాలు బయటికిరావు.

అలాగే గ్రామ ప్రాంతాలలో వివిధ జిల్లాల్లో ఎవరెవరికి ఎంతెంత నీరు అందుబాటులోకి వస్తోంది? ఏయే ఆదాయ వర్గాల వారికి ఏ రకంగా నీరు లభ్యమౌతోంది, వారికి అందే నీటిలో ఎంతవరకు వారి అవసరాలు తీరుతున్నాయి? ఏయే పద్ధతులద్వారా ఎంత సులువుగా లేక ఎంత కష్టతరంగా వారికి ఆ నీరు లభ్యమౌతోంది? భారత రాజ్యాంగం ప్రకారం ప్రజలందరికి సహజ వనరు అయిన నీరు సమానంగానే లభ్యమౌతోందా? లేదా? ఎంతెంత వ్యత్యాసాలున్నాయి అన్నది తెలుస్తుంది. అలా ప్రజలందరికి విషయాలు ఉన్నది ఉన్నట్లు తెలియచెబితేకాని, రాజ్యాంగం ప్రకారం వారి వాటా వారికి వస్తోందో, లేదో రాకపోతున్నట్లయితే దాని వెనుక ఉన్న కారణాలేమిటి, శక్తులేమిటి? తమకి రావాల్సిన వాటా ఏమయిపోతుంది? ఎక్కడికి పోతుందో తెలుసుకోగల్గుతారు. అలా తెలుసుకో గల్గిననాడు పాలకుల, ఏలికల వాగ్దానాలు వాటి నిజ స్వరూపం వారికి కళ్ళకు కడుతుంది. అప్పుడు వారు తప్పకుండా నిర్ణయించుకొంటారు ఏ టెక్‌తో ఏ గేర్‌లో వెళ్లాలో!

మేధావులు, ప్రజాపక్ష కార్యకర్తలు ఈ లెక్కలు తియ్యడం, వాటిని ప్రజల ముందుంచడం, తప్పక చెయ్యాల్సి వుంది. 'సమీక్ష' మార్చి 1-15, 2003 సంచికలో 'జీవధార' అనే హెడ్డింగుతో ఒక చిన్న వ్యాసాన్ని తొలిసారిగా ప్రచురించింది. ఈ అంశంపై మరింత విస్తృతంగా విభిన్న కోణాల నుండి వివరాలు, వ్యాసాలు వివిధ సెక్షన్స్ నుండి రచనలు ఆహ్వానించి ప్రచురించాల్సి ఉంది. ఆ కార్యక్రమం భాగంగానే ఈ 'నీరు-రివర్స్‌గేర్' జీన్ టర్నర్ అనే ఓ విజ్ఞుడు ఇలా అంటున్నాడు. "మన మరుగుదొడ్ల శుభ్రతకయ్యే ఖర్చెంత? నీటి సరఫరా కంపెనీలు మిలియన్ల ధనాన్ని వెచ్చించి శుభ్రపరచి సరఫరా చేసే స్వచ్ఛమైన నీటిని చాలామట్టుకు మనం మన ఇళ్లల్లో మరుగుదొడ్ల ఫ్లషింగ్‌కి వాడేస్తున్నాం. అదేమీ క్షమించరాని నీటి వాడకం కాదని ఎవరయినా అంటే బహుశా నేననుకొనే దానికన్నా ఎక్కువ అజ్ఞానన్న మాట." చూడండి, ఈయన ఓ కొత్త కోణం బయట పెట్టాడు. మంచిపాయింటే లేవనెత్తాడు. దీనిగురించి వివరాల్లోకి వెడితే దీని వెనక చాలా కథ ఉందని తెలుస్తోంది. త్రాగటానికి వాడాల్సిన నీటిని వేరే అవసరాలకి వాడేస్తున్నాం. ఏ రీసైకిల్డ్ నీరు దీనికి వాడగల్గితే అంతకు అంత మంచినీరు ఆదా అవుతుంది కదా! అలాగే తక్కువ పరిమాణపు నీటితో మంచిగా శుభ్రం చేయగల ఫ్లష్ డిజైన్లను, నీటి ఆదా టెక్నిక్‌ను ఉపయోగించడం ద్వారా, అధునాతన ప్లంబింగ్, సానిటరీ టెక్నిక్కులను ఆచరణలో పెట్టుకోవడం ద్వారా చాలామట్టుకు నీటిని ఆదా చెయ్యవచ్చు. నీటి వినియోగానికి కూడా ఇన్‌కంటాక్స్ స్లాబ్ సిస్టమ్ లాగా నీటి వినియోగానికి కూడా అటువంటి పద్ధతులో ఛార్జీలు, పన్నులు ఉండేట్లు చెయ్యాలి. నీటి వినియోగంపై కంట్రోల్స్ విధించాలి. విచ్చలవిడి వాడకానికి, ఆర్థిక, సామాజిక శిక్ష, పొదుపరులకు ఆర్థిక, సామాజిక లాభాలకు ప్రశంసలు ఉండాలి.

* ప్రపంచంలో ఉత్తర, దక్షిణ భాగాలలో నీటి అసమానత గురించి యుఎన్ అబ్జర్‌వేషన్ చూద్దాం. ఉత్తర ప్రపంచంలో ఐస్‌క్రీమ్ కోసం పదకొండు బిలియన్ డాలర్లు ఖర్చు పెడతారు. అంటే రూపాయల్లో సుమారుగా 52,000 కోట్ల రూపాయలు. ప్రపంచ జనాభాకి శుభ్రమయిన నీరు, శానిటేషన్ సౌకర్యం ఏర్పర్చ డానికి అయ్యే ఖర్చు కన్నా, ఈ ఐస్‌క్రీమ్‌కయ్యే ఖర్చు రెండు బిలియన్ డాలర్లు ఎక్కువ. అంటే 9400 కోట్ల రూపాయలు - కోట్లాది ప్రపంచ జనాభా త్రాగటానికి నీళ్ల లేక అల్లాడుతుంటే పాశ్చాత్య ప్రపంచంలో మనిషికి సగటున 1300 డాలర్ల నీటి వాడకం జరుగుతోంది. ఈ నీటి వినియోగ వ్యత్యాసం ప్రపంచంలో ఉత్తర భాగంలోనే కాక, దక్షిణ భాగంలో కూడా విపరీతంగా ఉంది. ఈ క్రింది వివరాలు చూడండి.

ముంబాయ్ వంటి నగరాల్లో వాటర్ స్పోర్ట్స్, ఎమ్యూజ్ మెంట్ పార్క్‌లయిన ఎసెల్ వరల్డ్, వాటర్ కింగ్‌డమ్ మరియు ఇతర పంచ నక్షత్రపు హోటళ్ళకు మున్సిపాలిటీలు, పైపులద్వారాను, ట్యాంకర్లద్వారాను సప్లై చేస్తున్న నీరు లెక్కకడితే మన గుండె గుభేల్

మంటుంది. కోకో కోలాకు చెందిన కిన్లే బ్రాండ్, పార్లేకు చెందిన బిస్లరీ బాండ్ తమ బాటిల్ నీళ్ల వ్యాపారానికి ఉపయోగించుకొనే నీటికి, కోట్లాది అల్పాదాయ వర్గాలు, శ్రామిక వర్గాలు ఉపయో గించుకొనే నీటకి మధ్య అగాధమయిన వ్యత్యాసం ఉంది. ఈ బడుగు జీవులు తమ నీటి అవసరాల గురించి తమ పిల్లల బాల్యాన్ని, వికాసాన్ని, చదువు సంధ్యల్ని, ఆరోగ్యాన్ని బలి పెట్టే ఓ బిందెడు నీళ్లకోసం కిలోమీటర్ల దూరం కాలినడకతో అగచాట్లు పడడం మనందరికి తెలుసు. ఈ విపరీత వ్యత్యాసాలు ఇలా కొనసాగవల సిందేనా? సంక్షేమ రాజ్యం అంటే ఇదేనా? ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామ్యదేశం అంటే ఇదేనా? ఈ వ్యత్యాసాల నిర్మూలనకు ఉన్న మార్గాలేమిటి? అందరూ ఆలోచించాల్సిన విషయమే మరి! ఇంకా ఎన్నో విషయాలు, భయంకరమైన నిజాలు, అభూత కల్పనలు ఈ నీటి చుట్టూ అల్లుకోబడి ఉన్నాయి. మరిన్ని వివరాలు, విశేషాలు వచ్చే సంచికలో పరిశీలిద్దాం.

* (ఈ వ్యాసంలో కొన్ని వివరాలు ముంబాయి నుండి వికాస్ అధ్యయన కేంద్రంవారు ప్రచురిస్తున్న ఫ్యాక్ట్స్ అగెనెస్ట్ మైథ్స్ అనే సమాచార బులిటిన్స్ నుండి తీసుకోవడం జరిగింది) ❑

(10వ పేజీ తరువాయి)

పేదరికపు రేఖ దాటగలిగారు. అయితే భూమి ఉత్పాదకతలో ప్రాంతీయ అసమానతలు గత నాలుగున్నర దశాబ్దాల్లో గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు 50వ దశకంలో మధ్యంతర కాలంలో దక్షిణ కోస్తా ఆంధ్రాకు, దక్షిణ తెలంగాణాకు మధ్య ఉన్న 150 శాతం పాయింట్లు, 90వ దశకం ఆఖరుకు 89 శాతం పాయింట్లు తగ్గింది. ఈ క్రమంలో ఉత్తర కోస్తా ఆంధ్ర చాలావరకు తగ్గిపోయి. ఉత్తర తెలంగాణా పరిశీలించగా లాభపడింది. ఉత్తర కోస్తా ఆంధ్రా రాష్ట్ర సగటుకు 49 శాతంపైన ఉన్న స్థాయినుంచి, సగటుకు కిందికి 12.5 శాతానికి పడిపోగా, ఉత్తర తెలంగాణా రాయలసీమకు ఉత్తర కోస్తా ఆంధ్రల స్థాయికూడా అంతకుముందు రాష్ట్ర సగటు కన్నా 45 శాతం గమనించగా వున్న స్థాయినుంచి రాష్ట్ర సగటును చేరుకొంది. రాష్ట్రావతరణ నాటికి ఉన్న స్థానంతో పోల్చి చూస్తే ఉత్తర, దక్షిణ తెలంగాణా ప్రాంతాలు చాలా ఎత్తు ఎదిగాయి. దక్షిణ తెలంగాణా కన్నా ఉత్తర తెలంగాణా పైస్థాయికి చేరుకొంది. సస్య విప్లవానికి పూర్వం రాష్ట్రంలోని మూడు వెనుకబడిన ప్రాంతాల్లో ఉత్పాదకత పెరిగి రాష్ట్ర సగటుకు ఉన్న తమ దూరాన్ని చాలా తగ్గించు కున్నాయి. అయితే సస్య విప్లవం అనంతరం 60వ దశకం చివరి భాగంలో, సారవంతంగా ఉన్న ప్రాంతాలు ఇంకా బాగా అభివృద్ధి సాధించటంలో ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. 70వ దశకం ఆఖరుకు రెండు తెలంగాణా ప్రాంతాల పరిస్థితి కొద్దిగా మెరుగైంది. కాని రాయల సీమ, ఉత్తర కోస్తా ఆంధ్రా ప్రాంతాలు భారీగా నష్టపోయాయి. అయితే 80వ దశకంలో అన్ని ప్రాంతాలు గణనీయ మైన అభివృద్ధి సాధించాయి. తిరిగి 90వ దశకంలో మొత్తంగా చూసుకుంటే అభివృద్ధి వెనుకపట్టుపట్టడంతో పాటు ప్రాంతీయ అసమానత పెరిగాయి.

ఉత్పత్తి సాంవత్సరిక అభివృద్ధి విషయంలో గత 44 సంవత్సరాల్లో ఉత్తర తెలంగాణా ప్రాంతం అత్యధికంగా 3.1 శాతం అభివృద్ధి రేటు సాధించగా, దక్షిణ తెలంగాణా 2.7 శాతం అభివృద్ధి రేటుతో రెండవ స్థానంలో వుంది. ఉత్తర కోస్తా ఆంధ్ర (1.7 శాతం), రాయలసీమ (1.9 శాతం) సాలుసరి అభివృద్ధి రేటు మాత్రమే సాధించగలిగాయి. మొత్తం రాష్ట్రంలో 90వ దశకంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధిరేటు గణాంకాలలో కొలవలేనంత తక్కువగా వుంది.

హెక్టారుకు సగటు ఉత్పత్తి కన్నా, తలసరి ఉత్పత్తి గ్రామీణ ప్రజల జీవన స్థాయిని సరిగా ప్రతిబింబిస్తుంది. రాష్ట్రంలో తలసరి సగటు వ్యవసాయోత్పత్తి విలువ రు. 4225, ఇది పేదరిక రేఖకు కొంచెం ఎక్కువగా వుంది. దక్షిణ కోస్తా ఆంధ్రాలో రు. 5200, తర్వాత రాయలసీమ రు. 4200 వుండగా దారిద్ర రేఖ స్థాయిలో ఉత్తర తెలంగాణా వుంది. ఉత్తరకోస్తా ఆంధ్ర దక్షిణ తెలంగాణా అందరికన్న దిగువన వరుసగా రు. 2900లు, రు. 2700లు తో పేదరికపు రేఖకు దిగువన ఉన్నాయి. భూమి ఉత్పాదకత తక్కువగా వుండడం వల్ల దక్షిణ తెలంగాణాలో ఆ కారణంతోపాటు మనిషి - భూమి నిష్పత్తి చాలా ఎక్కువగా వుండటం ఈ పరిస్థితికి కారణం.

(పంటల మార్పిడి, వ్యవసాయంలో పెట్టుబడులు, ఎరువుల వాడకం, పశువులు, పంట పండని భూములు, ఉత్పత్తిలో అంతరాలు, సమస్త కారకాల ఉత్పాదకత విషయం గురించి వచ్చే పక్షపత్రికలో) (సంక్షిప్త స్వేచ్ఛానువాదం) ❑

గ్రామీణులకు ఉపాధి, పశువులకు అందుబాటులో మేత, గ్రామాల్లో తాగునీటిని గూర్చిన అప్రమత్తత, నిరంతర విద్యుత్ సరఫరా, పేదలకు పదికిలోల ఉచిత బియ్యం" లాంటి మౌలిక విషయాలపై అందమైన కల్పనలుగా అల్లిన అద్భుత కథనం ఆధారంగా నిర్మించి, రాబోయే నాలుగు నెలలపాటు విరామం లేకుండా ఉచితంగా ప్రదర్శించబడనున్న గొప్ప రాజకీయ నాటకం

కరువు పలవరింత

కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం : నారా చంద్రబాబు నాయుడు

ముఖ్య తారాగణం : సాగు నీటి శాఖామాత్యులు, పశు సంవర్ధక శాఖామాత్యులు, గ్రామీణాభివృద్ధి, మరియు పౌర సరఫరాల శాఖామాత్యులు - పంచాయితి రాజ్ శాఖామాత్యులు - విద్యుత్ శాఖా మాత్యులు. **అతిథి నటులు** : కేంద్ర ప్రభుత్వం **విలన్లు** : ప్రజలు, ప్రజాపోరాట సంస్థలు, మహిళా సంఘాలు, మేధావులు, పత్రికలు, ప్రతిపక్షాలు

శ్రామిక వర్గానికి పొదుపు సాధ్యమా?

- ఇ.పి.ఎస్.పి. దర్శిని

సమాజంలోని శ్రామిక వర్గాల జీవితాల్లో కనిపిస్తున్న ఆర్థిక దుస్థితికి కారణం వారు పొదుపు పాటించకపోడమేననీ, వ్యసన మయ జీవితమేననే ప్రచారాన్ని పెట్టుబడిదారి సమాజం అనాదిగా కొనసాగిస్తోంది. ప్రధానంగా దోపిడి మీద బ్రతుకుతున్న వర్గం మాత్రమే కాకుండా, తమ శ్రమ విలువను మించి అనేకరెట్ల అదనపు ఆదాయాలు పొందుతున్న ఉన్నత మేధో శ్రామిక వర్గం, తమ శ్రమ విలువను పూర్తిగా పొందగలుగుతున్న స్వతంత్ర ఉత్పత్తి దారులు (అత్యధికంగా పెరిగిపోతున్న ఉత్పాదక శక్తితో ఉత్పత్తి విధానాన్ని నిర్వహిస్తున్న పెట్టుబడిదారీ వర్గంతో పోటీని ఎదుర్కొంటున్న వీళ్ళుకూడా, పూర్తి శ్రమవిలువను పొందలేకపోవడం తరచూ జరుగుతుంది) తమ శ్రమశక్తి విలువను మించి కొద్దిఎక్కువ ఆదాయాన్ని అందుకుంటున్న పైస్థాయి శారీరక శ్రమల సెక్షన్లు సైతం ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నాయి. ఆలోచించాల్సిన విషయ మేమిటంటే తమ ఆర్థిక దుస్థితికి కారణం తాము పొదుపు చేయకపోడమేననే తప్పుడు భావజాలంలోనే కిందిస్థాయి మేధో, శారీరక శ్రమలు చేస్తున్న వర్గాలున్నాయి.

మొత్తానికి శ్రామిక వర్గాల జీవిత ఆర్థిక దుస్థితికి కారణం పొదుపు చేయకపోవడమేనా? 'వ్యసనమయ జీవన విధానం' ఈ వర్గానికి సహజ జీవన విధానమా? దోపిడి వర్గాలతో సహా ఉన్నతే మేధో శ్రామిక వర్గాలన్నీ పొదుపు చేస్తున్నాయా? వాళ్ల ఆడంబర, అహంకార పూరిత జీవన విధానానికి పొదుపే కారణమా? వీళ్ల జీవన సంస్కృతి వ్యసనాల కతీతమా? అసలీ అసహజ వ్యసనాల సృష్టికి బాధ్యత ఎవరిది? ఎవరి అవసరాలకోసం ఇవి సృష్టించ బడ్డాయి? ఈ ప్రశ్నలకు జవాబులు చెబితేనే, దోపిడి వర్గాల ఆడంబర జీవన ఆర్థికస్థితి రహస్యం, శ్రామిక వర్గ జీవిత ఆర్థిక దుస్థితికి కారణం తెలుస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలో 'పొదుపు' అనే మాటకర్థం మిగలు అని కాదు. సహజావసరాలను కుదించడం మాత్రమే. ఎలాగంటే శ్రామిక వర్గం తము శ్రమ చేసి పొందుతున్న ఆదాయాలు శ్రమ విలువగా ఎన్నటికి ఉండవు. అవి కేవలం 'శ్రమశక్తి' విలువ గానే ఉంటాయి. అనేక సందర్భాల్లో అవి శ్రమశక్తి విలువగా కూడా ఉండవు. 'శ్రమశక్తి' విలువ 'శ్రమ విలువ' ఒకే అర్థాన్నిచ్చే పదాలు కావు. శ్రమ చేసేందుకు శక్తి ఉత్పత్తికోసం కావలసిన కనీస పోషక పదార్థాల ఉత్పత్తి విలువే 'శ్రమశక్తి' విలువ. దాన్నే మనం 'జీతం' అనో, 'వేతనం' అనో, 'కూలీ' అనో రకరకాలుగా పిలుస్తుంటాం. ఈ శ్రమశక్తి ద్వారా చేసే శ్రమవల్ల అయిన మొత్తం ఉత్పత్తి విలువే 'శ్రమ విలువ'. శ్రమ విలువలో శ్రమ శక్తి విలువ చాలా తక్కువ భాగంగా ఉంటుంది. తక్కువ విలువతో ఎక్కువ విలువను ఉత్పత్తి చేయడం సజీవ శ్రమ ద్వారా రుజువైంది. కాబట్టే దోపిడీ వర్గ సమాజం ఆవిర్భ వించింది. శ్రామికులు జీతాల రూపంలో అందుకుంటున్న 'శ్రమ శక్తి విలువ' దోపిడి వర్గం నిర్ధారించే అంశమే. వాళ్లు శ్రామికుల్ని శ్రామికులుగానే నిలిపిఉంచటంకోసం కావలసిన అతి తక్కువ అవసరాలను తీర్చుకునే ఉత్పత్తుల విలువల లెక్కే 'శ్రమశక్తి విలువ' గా నిర్ధారిస్తారు. పెట్టుబడిదారి దోపిడి వర్గాలంటే ప్రైవేటు పెట్టుబడి దారులు మాత్రమే కాదు. ప్రభుత్వం కూడా ఒక పెద్ద పెట్టుబడి దారే. తన శ్రామికుల వేతనాలు నిర్ణయించడం లో ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తుంది. ఈ విధంగా శ్రమశక్తి విలువగా ఉన్న వేతనాల భాగం ఎంత తక్కువగా ఉంటే తాము లాక్కునే అదనపు శ్రమ భాగం అంత ఎక్కువగా ఉంటుంది. ఈ విధంగా శ్రామిక వర్గ ఆర్థిక దుస్థితికి కారణం, పెట్టుబడి దారి వర్గ జీవిత ఆడంబరస్థితికి గల రహస్యం చాలా సులభంగా అర్థం చేసుకోవచ్చు. శ్రామికులు తమ శ్రమవిలువను పొందలేకపోవడమే వాళ్ల ఆర్థిక సమస్యలకు కారణం అయితే, శ్రమచేయకుండా శ్రామికుల అదనపు శ్రమ భాగాన్ని దోచడమే పెట్టుబడి దారి వర్గ ఐశ్వర్య జీవిత రహస్యం. శ్రామికులు తమకోసం మాత్రమే కాక, యజమానుల కోసం కూడా తామే శ్రమ చేయాల్సిన పరిస్థితిలో ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో శ్రామిక వర్గం 'పొదుపు' వాళ్ల కనీస శ్రమశక్తి విలువను కుదించు కునేదిగానే ఉంటుంది. కనీస శ్రమశక్తి విలువగా యజమానిచే నిర్ణయించబడ్డ 'జీతాలు' మరొక సారి కార్మికుని చేత కుదించబడితే గాని పొదుపు సాధ్యం కాదు. 'శ్రమశక్తి విలువ' కుదింపంటే 'శ్రమశక్తి' ని ఉత్పత్తి చేసే కొన్ని పోషక వస్తువులను తగ్గించుకోవడం. కొన్ని తప్పనిసరైన అవసరాలను తీర్చుకోకపోవడం. ఇది శ్రామికుని సజీవత్వానికి సంబంధించిన సమస్యగా మారుతుంది. కాబట్టి శ్రామిక వర్గానికి పొదుపుచేయడ మన్నది పూర్తి అసాధ్యమైన విషయం. అయినా శ్రామిక వర్గం ఎంతో కష్టంగా పొదుపును కొనసాగిస్తుంటుంది. ఎందుచేత?

పెట్టుబడిదారీ సమాజంలో పొదుపు చేయడమన్నది శ్రామిక వర్గానికి సంబంధించిన అంశంగానే ఉంటుంది. ఎందుకంటే

'శ్రామిక వర్గం తను చేసే శ్రమ ఫలితంగా పొందుతున్న జీతాల ద్వారా పొందలేకపోతున్న అనేక ఉత్పత్తులను కనిసస్థాయిలోనైనా పొందగల ఒకే ఒక మార్గంగా పొదుపు కనబడుతుంది. ఆ మార్గంలోనే మిగతా అవసరాలను తీర్చుకోగలనన్న భ్రమల్లో ఉంటుంది. గనుక (ఆ భ్రమల సృష్టి, ప్రచారం కూడా దోపిడి వర్గం ఫలితమే) శ్రామిక వర్గం తాను గురవుతున్న శ్రమ దోపిడే తన ఈ ఆర్థిక దుస్థితికి కారణమన్న అసలు నిజాన్ని గ్రహించడం లేదు. గనుక మరొక వైపు దోపిడి వర్గానికి 'పొదుపు' సమస్య ఎందుకుండదంటే 'దోపిడి' మార్గంలో అది పొందుతున్న ఆదాయానికి హద్దూ, బద్దూ ఏదీ ఉండదు గనుక, దాన్ని ఏస్థాయిలోనైనా, ఏ పద్ధతిలోనైనా పొందే అవకాశాన్ని కలిగి ఉంది కాబట్టి. దోపిడి వర్గానికుండే సమస్యల్లా హద్దూ బద్దూ లేని ఆదాయిన్ని ఎట్లా ఖర్చు తీర్చుకుంటున్నా ఇంకెంతో భాగం మిగిలే ఉంటుంది. కాబట్టి ఈ వర్గానికి ఆదాయాన్ని పోగెయ్యడం సమస్యే కాదు. ఈ విధమైన దోపిడి వర్గం పొదుపు పాతపెట్టుబడికి కొత్తపెట్టుబడి కలిసేదిగా ఉంటుంది. ఆ విధంగా పరిమాణం పెరిగిన పెట్టుబడి శ్రామికుల అదనపు విలువను మరింత ఎక్కువగా దోచి తెస్తుంది. ఇలా రోజు రోజుకు పెరిగిపోతున్న సంపదను ఖర్చుపెట్టడం ఒక దశలో అసాధ్యంగా తయారవుతుంది. కాని శ్రామిక వర్గానికి ఆదాయాన్ని పోగెయ్యడం సమస్యగాని, ఖర్చుపెట్టడం ఒక సమస్యే కాదు. దాన్ని ఖర్చు చేయదలిస్తే ఏరోజు కారోజు ఖర్చయిపోయేదే. ఒక శ్రామికుడు తన జీవితాంతం తిని తినక తన జీవితావసరాలను తగ్గించుకొని పోగేసిన కొంత మొత్తాన్ని ఖర్చు చెయ్యడం క్షణాల్లో సాధ్యమయ్యేపని.

పిల్లలకి పొదుపును నేర్పడమంటే...

శ్రామిక వర్గ తల్లిదండ్రులు పిల్లలకి చిన్నప్పటినుండే 'పోస్టాఫీసు', గల్లపెట్టెల ద్వారా పొదుపును అలవాటు చేస్తూ బోధిస్తుంటారు. కానీ తల్లిదండ్రులు పొదుపు విషయంలో తెల్సుకోవాల్సిన కొన్ని విషయాలున్నాయి. 'పొదుపు' అంటే అవసరాల కుదింపుగా, అవసరాల తగ్గింపుగా, ఉండకూడదు. అవసరాల తగ్గింపుగా కాకుండా 'అవసరాలకు తగినంతగా' అనే అర్థంలో పిల్లలకు పొదుపును అర్థం చేయించాలి. పొదుపును డబ్బు రూపంలో నిర్వహించడం తప్పకుండా పినాసితనానికి దారి తీస్తుంది. ఆ విధంగానో పోగుపడుతున్న డబ్బుకు మరింత డబ్బును కలుపడం ద్వారా దానిసైజు పెంచాలనే అసహజమైన దోపిడీ స్వభావానికి దారి తీస్తుంది. పొదుపును డబ్బు రూపంలో నిర్వచించడం కాకుండా వస్తువలు (ఉపయోగపు విలువలు) దుబారాను తగ్గించే విషయంగా బోధిస్తే ఎంతోమంచిది. వస్తువుల దుబారాను తగ్గించటం అంటే ఉత్పత్తుల అవసరాలను కుదించుకోవడంకాదు. పెట్టుబడిదారీ సమాజంలో కొత్తన్నా మాయకుండానే అనేక ఉత్పత్తుల్ని వాడకం లోనుంచి తీసేయడం కనబడుతుంది. ఇది పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానం పరుగువేగాన్ని పెంచి ఉత్పత్తి దారునికి ఆదాయం త్వరత్వరగా పెంచే క్రమానికి దోహదం చేస్తుంది. పైగా ఈ ధోరణి పూర్తిగా శ్రమను అగౌరవపరిచేదిగా ఉంటుంది. అలా కాకుండా వస్తువులోని ఉపయోగపు విలువను పూర్తిస్థాయిలో అనుభవించగలిగే విధానంగా ఆచరించగలిగితే సమాజంలో ఎంతో శ్రమను ఆదాచేయగలిగిన వాళ్లమవుతాం. ఇది పెట్టుబడి ప్రయోజనానికి వ్యతిరేకం కూడా. పొదుపును డబ్బు రూపంలో నిర్వహిస్తే అవసరాల తగ్గింపు అనివార్యం. ఉత్పత్తుల దుబారాను తగ్గించడంగా పొదుపును అర్థం చేసుకోగలిగితే అది శ్రమపట్ల గౌరవాన్ని పంచేదిగా ఉంటుంది. తీర్చుకోలేని అవసరా లను తీర్చుకొనే మార్గంగా పొదుపు బోధించడం అసలు విషయాన్ని మరుగుపరుస్తుంది. తీర్చుకోలేని అవసరం ఎందుకు తీరడంలేదో తెలిస్తే ఆ వైపుగా ప్రయత్నాన్ని కొనసాగించవచ్చు. అపుడు పొదుపనే మాటకర్థమే లేని వట్టి పనికిమాలిన పదంగా తయారౌతుంది.

పెట్టాలన్నదే అయితే పెట్టుబడిదారుల 'పొదుపు'ను కూడా అర్థం చేసుకోవాల్సిన కోణం ఉంది. పెట్టుబడిదారీ దోపిడి వర్గం ఆదాయం శ్రామికులు కోల్పోయిన అదనపు శ్రమ విలువే కాబట్టి దోపిడి వర్గం పొదుపంటే అదనపు విలువరాశిని పోగెయ్యడమే. కాని శ్రామిక వర్గం తన వేతనాల్ని (శ్రమశక్తి విలువని) పోగెయ్యడాన్ని, పెట్టుబడి దారివర్గం శ్రామికుల అదనపు శ్రమని పోగెయ్యడాన్ని ఒకే విధంగా అర్థం చేసుకోకూడదు. దోపిడీ వర్గాలు తమ ఆదాయాలైన శ్రామిక వర్గ అదనపు విలువను పోగెయ్యడమంటే అది తిరిగి పెట్టుబడిగా మారడమే. దోపిడి వర్గాలు తమ ఆదాయాలలో ఎన్నెన్నో అంతులేని ఆడంబర, అహంకార పూరిత, అసహజ, అసహ్య అలసరాలు

పెట్టుబడిదార్ల పొదుపుకున్న మరో కోణాన్ని కూడా చూడాలి. ఉత్పత్తి స్థలంలో శ్రామికుల పని భద్రత, ఆహ్లాదకరమైన పని పరిస్థితి, సౌకర్యాల్ని తగ్గిస్తూ పెట్టుబడి దారి వర్గం నిరంతరం పొదుపు చేస్తుంది. నిజానికి వీటిని పొదుపు చేయాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే ఉత్పత్తి స్థలంలో ఉత్పత్తికోసం శ్రామికులకు సహజంగా అవసరం కావాల్సిన ఈ శ్రమ విలువలు సరుకులోకి చేరి సరుకు విలువని పెంచి అమ్మకం ద్వారా వెనక్కివచ్చేవే. అయినా పెట్టుబడి దారుడు వాటి ఖర్చును, ఎందుకు తగ్గిస్తాడంటే, మార్కెట్లో వివిధ పెట్టుబడిదారుల మధ్య నిరంతరం కొనసాగుతున్న 'రెలెటివ్ అదనపు విలువ (ప్రత్యేక లాభం), కోసం కొనసాగుతున్న పోటీలో

అందరికంటే అతితక్కువ ఖర్చుతో, సరుకును ఉత్పత్తిచేస్తూ అందరికంటే తక్కువ ధరకే అమ్మినా అందరికంటే ఎక్కువ లాభం రాబడుతూ, అందరికంటే ఎక్కువ సరుకుని అమ్ముకోవడం కోసమే.

శ్రామికుల పొదుపును పైపైన చూస్తే అది వారి అవసరం గానే కనబడుతుంది. కాని అది నిజంగా అవసరపడేది సరుకు ఉత్పత్తిదార్లకే. అందులో కొంత శ్రామికులకు తిరిగి అప్పుల రూపంలో అందినా ఆ అప్పు తీసుకున్న శ్రామికుడు ఆ డబ్బుతో పెట్టుబడి దార్ల ఉత్పత్తుల్ని కొనాల్సిందే. ఆ రకంగా అది పెట్టుబడి దార్ల సరుకు ఉత్పత్తిక్రమానికి, ఆ ఉత్పత్తికారణంగా అదనపు విలువ సృష్టికి కారణం అవుతుంది. కార్మికుల పొదుపులో మరో భాగం, అతి తక్కువ వడ్డీకో, లేక వడ్డీ లేని అప్పుగానో, ఇంకా అసలు తిరిగి చెల్లించాల్సిన అవసరమే లేని సహకారం పేరుతోనో పెట్టుబడిదార్ల పరమే అవుతుంది. ఈ విధంగా శ్రామికుల పొదుపు శ్రామిక వర్గానికి ఏరకంగాను అవసరపడకపోగా అది పెట్టుబడిగా మారి శ్రామిక వర్గ రక్తమాంసాల్ని అదనపు విలువ రూపంలో పిండేస్తుంది.

ఒకవేళ శ్రామిక జనాలకు వాళ్ల ఆదాయాలతో తీరని కొన్ని తప్పనిసరి అవసరాలని తీర్చుకునే మార్గంగా పొదుపును బోధిస్తున్నా అందులో నిజం లేదు. ప్రస్తుత దోపిడీ వర్గ సమాజంలో మనుషు లందరూ అనుభవిస్తున్న అవసరాలన్నీ తప్పనిసరైన సహజావ సరాలేం కావు. ఇందులో చాలా అవసరాలు పూర్తిగా అసహజమైనవి. అసహ్యకరమైనవి. శ్రామిక వర్గం తమ 'శ్రమశక్తి' ని పొదుపు ద్వారా కుదించుకుని భవిష్యత్తులో తీర్చుకోవాలనే అవసరాల్లో కొన్ని సహజమైనవి. కొన్ని అసహజమైనవి. ఈ పొదుపుద్వారానే సాధ్యమయ్యే సహజాసహజ అవసరాల సృష్టి కూడా వర్గసమాజపు అసమాన ఉత్పత్తి సంబంధాల ఫలితమే.

ఉదాహరణకు ఇల్లు శ్రామికునికి సహజమైన నివాస అవసరం. ఒక శ్రామికుడు సౌకర్యవంతమైన ఇంటిని తన శ్రమ ద్వారా సహజంగా పొదగలిగే అవకాశం ఉండాలి. కాని శ్రమ సరుకైన తర్వాత శ్రమ విలువకు బదులు శ్రమశక్తి విలువనే పొందుతున్న సామాజిక పరిస్థితుల్లో కనీస సౌకర్యవంతమైన ఇల్లును కలిగి ఉండాలన్నా అది శ్రామికునికి పొదుపు ద్వారానే సాధ్యమయ్యే పరిస్థితి. వేతన భాగంలో ఇల్లుకు సంబంధించిన భాగం ఉండదా అంటే ఉంటుంది. కాని అది సౌకర్యాలు లేని సంపూర్ణ నాసిరకం ఇల్లుగా ఉంటుంది. ఈ విధంగా ఇల్లు అనేది సహజావసరమే అయినా ఆ అవసరాన్ని పొదుపు మార్గంలోనే తీర్చుకోవడమన్న సమస్య పెట్టుబడిదారుని సృష్టే. ఇలాగే పిల్లల చదువు ఇలా సహజావసరాలు, కూతురిపెళ్లి వరకట్న సమస్య, పండుగలు, జాతరలు, ఆభరణాలు, పెట్టిన రోజులు, ఆరోగ్యం (ఆరోగ్య సమస్య అంటే వైద్యం, వైద్యంలో కూడా ఎక్కువ భాగం పెట్టుబడిదారీ దోపిడీ ఉత్పత్తి విధానపు ఫలితమే. ప్రకృతి సహజమైన జనానికి సంబంధించి, అనుకోని ప్రకృతి విపత్తుల కారణంగా సంభవించే అనారోగ్య సంబంధిత వైద్య సేవలే, ఏ సమాజానికైనా శాశ్వత సహజావసరం, కానీ పెట్టుబడి దారి ఉత్పత్తి విధానంలో మనుషులు అనుభవిస్తున్న కొన్ని వందల రకాల అనారోగ్య సంబంధిత సమస్యలన్నీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సృష్టే లాంటి అసహజావసరాల సృష్టికి పూర్తిగా దోపిడి వర్గమే కారణం.

ఇకపోతే శ్రామిక వర్గ ఆర్థికస్థితికి ఆ వర్గం వ్యసనాల్లో మునిగి తేలడమే కారణమా? శ్రామిక వర్గ దారిద్ర్యానికి యజమాన వర్గ ఐశ్వర్యానికి గల అసలు కారణమంతా శ్రమ దోపిడిలోనే ఉందన్న సంగతి ఈ సరికే అర్థమైఉండాలి. ఇపుడు సమాజంలో మనుషులకు చాలా సహజమైన అవసరాలుగా కొనసాగుతున్న, మద్యం, జూదం, గుర్రప్పందాలు, సినిమాలు, కుక్కల పెంపకం, అందాల పోటీలు, ఆటల పోటీలు లాంటి అనేకానేక విషయాలైన టువంటివన్నీ దోపిడి ఉత్పత్తి సంబంధాల సృష్టే. ఇవి సమాజంలో మానవ జీవితానికి అసరమేలేని అసహజమైన అవసరాలు. దోపిడి వర్గాలకే అవసరంగా ఆవిష్కరించబడి వాళ్ళ అసహజ జీవిత విధానంలో భాగమైన విషయాలు, శ్రామికుల అదనపు విలువను అంతులేకుండా పొందగలుగుతున్న దోపిడి వర్గానికి ఆ ఉత్పత్తుల్ని ఒక దశలో ఖర్చుపెట్టుకోవడం అసాధ్యమైన విషయంగా ఉంటుంద ని చెప్పుకున్నాం. సరిగ్గా ఆ పరిస్థితే ఇలాంటి అసహజ కార్యక్రమాల పుట్టుకకు దారి తీసింది. తన వినోదం కోసం తనే సృష్టించుకున్న అసహజ కార్యక్రమాలను క్రమంగా సమాజంలో సరుకులుగా మార్చి వ్యాపారం మొదలుపెట్టింది. దాంతోపాటు ఆవిధమైన అసహజ, అసహ్య కార్యక్రమాలకు మెరుగులు దిద్దుతూ తమ సరుకుల అమ్మకంలో ప్రచారసాధన వేదికలుగా రూపాం దించింది. ఆ విధంగా ఆ అసహజ కార్యక్రమాలు శ్రామిక వర్గాలకు వాళ్లకే తెలియకుండా వాళ్ల జీవితంలో భాగమైపోవడానికి పూర్తి కారణం దోపిడి వర్గమే. పెట్టుబడిదారి వర్గం తను సమాజంలో నిరంతరం చేస్తున్న అంతులేని శ్రమదోపిడి కార్య క్రమాన్ని గ్రహించలేని చైతన్య రహిత స్థితిలో శ్రామికవర్గం పడిపోవడం దోపిడి వర్గానికి ఈ వ్యసనాల సృష్టి ద్వారా దొరికిన మరో అదనపు కానుక.

పొదుపు అనేది కేవలం పెట్టుబడి దారులతో సహా శ్రమ చేయని వర్గం తమ స్వార్థం కోసం శ్రామిక వర్గాలకు చెబుతున్న మోసంతో కూడిన నీతి కూత. 'పొదుపు' అనేది దోపిడివర్గ సమాజానికి మాత్రమే. ఆ సమాజంలో మాత్రమే వినిపించే పదం. నూతన సమాజంలో పొదుపు అసహజమైన, అర్థం లేని పదం. ❐

ప్రజాపక్ష సమీక్షకు రచనలు, ఉత్తరాలు పంపించవలసిన చిరునామా :

వి. హనుమంతరావు

8-3-898/22, రోడ్ నెం. 3,

నాగార్జున నగర్,

హైదరాబాద్ - 500 073.

(చందాలు, విరాళాలు, చెక్కులు, డిమాండ్ డ్రాఫ్టులు 'వి. హనుమంతరావు' పేరిట పంపాలి.)

బీమారంగంలో నూతన పరిణామాలు

- వై. కృష్ణమూర్తి

బీమారంగంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశానికి వీలు కల్పించే చట్టం, నిబంధనలు అమలుకు వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికాబోతోంది. దేశంలోని బడా పెట్టుబడిదారులు బిర్లా, తాతా, రిలయన్స్, బజాజ్ లాంటి పన్నెండు సంస్థలు బీమా రంగంలో ప్రవేశించాయి. రిలయన్స్ సంస్థ మినహా అన్ని సంస్థలు విదేశీ భాగస్వాములతో చేతులు కలిపి రంగప్రవేశం చేసాయి. బ్యాంకింగ్ సంస్థలైన యస్.బి.ఐ., హెచ్.డి.ఎఫ్.సి., వైశ్యా బ్యాంకులు కూడా బీమా రంగంలో ప్రవేశించాయి. విదేశీ భాగస్వాముల పెట్టుబడి రెండు శాతానికి పరిమితం చేసినా, సాంకేతిక, బీమా, వాణిజ్య నైపుణ్యాలకు అంతంగా అనుభవం లేని ప్రైవేటు దేశీయ సంస్థలు వాటిమీద ఆధారపడక తప్పదు.

జీవిత బీమా సంస్థను యధాతధంగా కొనసాగిస్తున్నారు. కాని జాతీయ సాధారణ బీమా (జనరల్ ఇన్సూరెన్స్) సంస్థను రద్దు చేశారు. దాని శాఖలైన న్యూ ఇండియా, నేషనల్ యునైటెడ్ ఇండియా, ఓరియంటల్ కంపెనీలకు స్వయం ప్రతిపత్తి గలిగిన కార్పొరేషన్లుగా ఏర్పాటు చేశారు. వాటి మధ్య పరస్పర పోటీతోపాటు ప్రైవేటు కంపెనీల పోటీని కూడా అవి ఎదుర్కోవాలి. సాధారణ బీమా సంస్థ స్థానే 'రీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' ఏర్పాటు చేశారు. పెద్ద మొత్తం జీవిత బీమా, భారీ విలువ గలిగిన ఆస్తులు బీమా మొత్తంలో కొంత భాగాన్ని 'రీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్'కి బదలాయించి ఆకస్మికంగా వచ్చే భారీ ప్రమాదాల నష్టాన్ని కొంతమేరకు ఈ రూపేణా బీమా సంస్థలు తగ్గించుకుంటాయి. ఈ సేవలు మనదేశంలో లేనందువల్ల ఇన్నాళ్ళు విదేశీ సంస్థల మీద ఆధారపడటం జరిగింది. ఈ ఏర్పాటుతో చాలాభారం తగ్గింది.

ప్రభుత్వరంగ బీమా సంస్థలకు ప్రజలలో ఎంత పేరు, గుర్తింపు వున్నదంటే దాదాపు అంతే మోతాదులో శతాబ్దానికి పైగా వునికిలో వున్న తాతా, బిర్లా, టి.వి.యస్ లాంటి సంస్థలకు ఉన్నంత గుర్తింపు సాధించాయి. ఇపుడీ ప్రైవేటు సంస్థలు బీమా రంగంలో ప్రవేశించడంతో ప్రభుత్వరంగ బీమా సంస్థలు గట్టి పోటీని చవి చూస్తున్నాయి. అవి తమ అలసత్వాన్ని, పట్టాదారుని ఎడల నిరాదరణను వదలి, పట్టాదారుని విశ్వాసాన్ని పొందకపోయినచో పట్టాదారులు ప్రైవేటు సంస్థలవైపు మొగ్గుచూపడం ఖాయం. అందువలన నేడున్న పట్టాదారుల విశ్వాసాన్ని కాపాడుకొనటానికి అన్ని విధాల కృషి చెయ్యాలి.

ప్రైవేటు బీమా సంస్థలను యాజమాన్య పద్ధతులలో ఆరితేరిన, ఎన్నో వ్యాపార ట్రిక్కులు తెలిసిన కుటుంబాలు నడుపుతున్నాయి. ఆధునిక ప్రైవేటు బ్యాంకులైన ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకొంటున్నాయి. ఈ సంస్థలు బ్యాంకింగు రంగంలో తమ అనుభవాన్ని జోడించి, బీమా రంగంలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెడుతున్నాయి. ఇది నూతనంగా వచ్చిన సవాలు. జాతీయ బీమా సంస్థలు మానవ వనరుల మీద ఎక్కువ ఆధారపడగా, ప్రైవేటు బీమా సంస్థలు సాంకేతిక పరిజ్ఞానం మీద ఆధారపడుతున్నాయి. కొద్దిమందిని మాత్రమే ఉద్యోగాలలో నియమిస్తున్నారు. జాతీయ బీమా సంస్థలు కూడా తమ సాంకేతిక స్థాయిని పెంచుకొని మెరుగైన సేవలు అందించటానికి కృషి చేస్తున్నాయి. జీవిత బీమా సంస్థ 1434 శాఖలను అనుసంధించింది. (నెట్ వర్కింగ్) మిగిలిన 614 శాఖలను ఈ సంవత్సరం లోపున అనుసంధించే పని పూర్తి చేసింది. దీనివల్ల పట్టాదారులు తమ పట్టా ప్రీమియంలు ఏ శాఖా కార్యాలయంలోనైనా చెల్లించే వీలు కలుగుతుంది. అదనంగా పట్టాను మదుపు పెట్టి ఏ శాఖనుండైనా ఋణం పొందే సౌలభ్యం కూడా ఏర్పాటు జరగాలి. సాంకేతికంగా ఇటువంటి సేవ అందజేయటానికి వీలున్నది. పట్టాదారులు ప్రీమియం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3.30 గంటల వరకూ చెల్లించే వీలు త్వరలో ఏర్పాటు కాబోతుంది. సాధారణ బీమా సంస్థ ఇంతకు పూర్వమే తన పనిని కంప్యూటర్ల ద్వారా నిర్వర్తిస్తున్నది.

బీమా నియంత్రణ యంత్రాంగం (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ కమీషన్) కొన్ని నియమాలను ప్రకటించింది. పుట్ట గొడుగుల్లాగ పుట్టుకొని బీమా కంపెనీలకు వీలు పడని విధంగా కనీస పెట్టుబడి రు. 100 కోట్లుగా నిర్ణయించింది. కంపెనీ నిర్వహణాధికారిని బీమా నియంత్రణాధికారి అనుమతితోనే నియమించాలి. వారు అమ్మే పాలసీలను బీమా నియంత్రణాధికారి పరిశీలనకు పంపి అనుమతి పొందాలి. బీమా వ్యాపారం చేసే ఏజెంట్లు తమను నియమించిన సంస్థకే వ్యాపారం అందించాం. ఇతర కంపెనీలకు వ్యాపారం వారికి కమీషన్ చెల్లించబడదు. ఏజెంట్లకు తోడుగా బీమా వ్యాపారం వ్యాప్తికి బ్రోకర్లను, కార్పోరేట్ ఏజెంట్లను బీమా నియంత్రణా యంత్రాంగం అనుమతిస్తుంది. బ్రోకర్లు పట్టాదారుని తరపున బీమా రక్షణ ముందుగానే అమ్మి కంపెనీ అనుమతి తరువాత పొందవచ్చు. ఎవరు తక్కువ ప్రీమియం ప్రకటిస్తారో ఆ కంపెనీకి బ్రోకరు ఆ బీమా ప్రపోజలును ఇవ్వవచ్చును.

బ్యాంకులు బీమా రంగంలోకి ప్రవేశించాయని ఇదివరకే చెప్పుకున్నాం. కొన్ని బ్యాంకులు బీమా సంస్థలతో అవగాహనకు

వచ్చి బీమా పాలసీలను అమ్ముతున్నారు. "మన రాష్ట్రంలో ఆంధ్రా బ్యాంకు", "బిర్లాసన్ లైఫ్" బీమా సంస్థలతో అవగాహనకు వచ్చింది. జీవిత బీమా సంస్థ కార్పొరేషన్ బ్యాంకుతోను, ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్సుతోను అవగాహనకు వచ్చింది.

జాతీయ బీమా సంస్థలకు ప్రభుత్వ హామీ పెద్ద ఆలంబన బలం. ప్రభుత్వ హామీని తొలగించాలని ప్రైవేటు బీమా సంస్థలు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. జీవిత బీమా సంస్థ ఎప్పుడో పెట్టుబడి పెట్టిన రు. 5 కోట్లకు నేటి ఆస్తులు ఆర్థిక వనరులు, మధ్య సమతుల్యం లేదు కనుక రు. 5000 కోట్లు రిజర్వుఫండు ఏర్పరచాలని బీమా నియంత్రాణాధికారి బీమా సంస్థను ఆదేశించారు. ఆదాయపు పన్నును నేడున్న 12.5 శాతం నుండి 30 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాయి. వీటన్నిటికి తోడు ఈ సంవత్సరం బడ్జెట్‌లో 8 శాతం సేవా పన్ను బ్రోకర్లమీద, ఏజెంట్ల మీద విధించింది. ఈ సేవా పన్నును బీమా సంస్థలే భరిస్తున్నాయి. ఏదైనా కారణం వలన ఈ భారం అధికమైనచో ఈ భారాన్ని పరోక్షంగా పట్టాదారులు చెల్లించే ప్రీమియంలో కలిపి అధిక ప్రీమియం వసూలు చేయాలి. పడిపోతున్న వడ్డీ రేట్లు బీమా కంపెనీల పెట్టుబడుల మీద ఆదాయానికి పెద్ద గండి కొట్టాయి.

గుజరాత్‌లో పెనుతుఫాను, మత కల్లోలాల వల్ల అధికంగా నష్టం జరిగింది. ఆ రాష్ట్ర ప్రజల జీవనం ఛిన్నా భిన్నమైంది. అంతటి గడ్డు పరిస్థితిని చక్కదిద్దటంలో సక్రమంగా, వేగంగా బీమా క్లైములు చెల్లించి బీమా సంస్థలు తోడ్పడ్డాయి. తమ సామాజిక కర్తవ్యాన్ని నిర్వర్తించాయి. ప్రైవేటు సంస్థలు ఈ పని చేస్తాయా? ఇక్కడ ఒక పోలికను చూపాలి. అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలను తీవ్రవాదులు కూల్చి వేశారు. పెద్ద నష్టం జరిగింది. కాని అమెరికా బీమా సంస్థలు దివాళా ఎత్తాయని ప్రకటించి తమ బాధ్యతనుండి తప్పుకొన్నాయి. సామాజిక కర్తవ్య బాధ్యత నిర్వహణలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు ఏ విధంగా ప్రవర్తించేది పై అనుభవాలు తేల్చి చెప్పాయి. ప్రైవేటు బీమా సంస్థలు పట్టణాలకు నగరాలకు పరిమితమై ధనాఢ్య వర్గాలతో బీమా వ్యాపారం సాగిస్తున్నారు. జాతీయ బీమా సంస్థలు అన్ని వర్గాల ప్రజలతో బీమా వ్యాపారాన్ని చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలనుండి సగం పైగా ప్రీమియం వసూలు అవుతున్నది. బీమా రంగంలో ప్రైవేటు సంస్థల ప్రవేశం తరువాత బీమా నిధుల వినియోగంపై వున్న కొన్ని ఆంక్షలు, నిబంధనలు సడలించారు. జీవిత బీమా రంగంలో ప్రభుత్వ, సెక్యూరిటీస్ లేక ప్రభుత్వ అనుమతి పొందిన, సామాజిక ప్రయోజనం కలిగిన పథకాల నిధులలో 85 శాతం వరకూ పెట్టుబడి తప్పనిసరి. సాధారణ బీమా సంస్థ 75 శాతం పెట్టుబడిపై పై తెలిపిన రంగాలలో విధిగా పెట్టాలి. నేడు సరళీకరణ ద్వారా ఆ పెట్టుబడులను 65 నుండి, 55 శాతానికి తగ్గించారు. దాదాపు 20 శాతం నిధులు మార్కెటు (స్పెక్యులేషన్) లేక చట్టా వ్యాపారానికి బదలాయించారు.

మనదేశ బీమా రంగంలో రెండు విభాగాలు వేగం పుంజు కొంటున్నాయి. అవి: పెన్షన్ పథకాలు, ఆరోగ్య బీమా విభాగం, ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. వార్ధక్యంలో భద్రత కరువైంది. ఆర్థికంగా స్వయంకృషితో రక్షణ కల్పించుకొనుటకు వీలు కల్పించే పెన్షన్ పథకాలు వ్యాప్తిలోకి వచ్చాయి. సామాన్యునికి ప్రభుత్వ వైద్యశాలలే దిక్కు. కార్పొరేట్ వైద్యశాలల ఛార్జీలు సంపన్నులు కూడా భరించలేనంతగా పెరిగిపోయాయి. కాస్త స్థాయి వున్నవారు ఆరోగ్య బీమా పథకాలలో చేరి రక్షణ పొందుతున్నారు.

ఆరోగ్య బీమా క్లైముల పరిష్కార బాధ్యతను స్వతంత్ర కార్య నిర్వహణా సంస్థలకు (థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్) జాతీయ బీమా సంస్థలు అప్పగించి తమ సామాజిక బాధ్యతనుండి కొంత మేరకు తప్పుకున్నాయి. ఇది పూర్తి వ్యాపార సరళిలో జరిగిన నిర్ణయమే కాని సామాజిక నిబద్ధతతో కూడింది కాదు. పట్టాదారులు క్లైముల చెల్లింపుకు ప్రభుత్వరంగ సంస్థలను కాక ప్రైవేటు సంస్థల చుట్టూ తిరగాలి. అనుభవం మీద కాని యదార్థం బయట పడదు.

బీమా రంగంలో ప్రైవేటు సంస్థలు కార్పొరేటు వ్యాపారాన్ని ప్రభుత్వరంగ బీమా సంస్థలకు పోకుండా చూడటంలో కొంతమేరకు విజయం పొందాయి. మార్కెట్‌లో 8 నుండి 9 శాతం వరకు ప్రీమియం వసూలు చేయగలిగారు. ఇది రెండు సంవత్సరాల అనుభవం. ఏ బీమా సంస్థ అయినా నిలకడ సాధించటానికి అయిదు సంవత్సరాలనుండి 10 సంవత్సరాలు పట్టవచ్చు. మరి ఈ లోగా ప్రభుత్వరంగ బీమా సంస్థలు నేడున్న పట్టాదారుల విశ్వాసాన్ని నిలుపుకోవడమే కాక, విస్తరించగలిగితే అదే పెద్ద పెట్టుబడి, బలం, ప్రభుత్వరంగ బీమా సంస్థల భవితవ్యాన్ని కాలమే నిర్ణయించాలి.

ప్రైవేటు జీవిత బీమా సంస్థలు

మనదేశ భాగస్వామి	విదేశీ భాగస్వామి
బజాజ్	అలంజ్ (జర్మని)
బిర్లా	సన్‌లైఫ్ (కెనడా)
హెచ్‌డిఎఫ్‌సి	స్టాండర్డ్ లైఫ్ (బ్రిటన్)
ఐసిఐసిఐ	ప్రుడెన్షియల్ (బ్రిటన్)
వైశ్యాబ్యాంకు	ఐయస్‌జి (ఆస్ట్రేలియా)
మాక్స్	న్యూయార్క్ లైఫ్ (అమెరికా)
మహేంద్రా	ఓంకోటక్ (దక్షిణ ఆఫ్రికా)
యస్‌బిఐ	కృఫ్స్ (ఫ్రాన్స్)
డాబర్	సిజియు (ఇటలీ)
సన్మార్	ఎయంపి (ఆస్ట్రేలియా)
తాతా	ఎఐజి (అమెరికా)
మైసూరు నుండి కొందరు పెట్టుబడిదారులు	మెట్రోపాలిటన్ (అమెరికా)

ప్రైవేటు సాధారణ బీమా సంస్థలు

చోలమండలం	లేరు
బజాజ్	అలంజ్ (జర్మనీ)
ఐసిఐసిఐ	లొంబార్డ్ (ఇటలీ)
ఇఫ్‌కో	టోకియో (జపాన్)
రిలయన్స్	లేరు
సుందరం	రాయల్ (బ్రిటన్)
తాతా	ఎఐజి (అమెరికా)

నవంబరు 2002 చివరకు జీవిత బీమా

	పట్టాలు	మొదటిసారి ప్రీమియం రు. కోట్లు	శాతం పట్టాలు	శాతం ప్రీమియం
వ్యక్తిగత బీమా				
జీవిత బీమా సంస్థ	10481912	2230.87	97.01	90.49
ప్రైవేటు బీమా సంస్థలు	323579	234.37	2.99	9.51
వ్యక్తిగత పెన్షన్ పట్టాలు				
జీవిత బీమా సంస్థ	29314	63.45	54.53	66.05
ప్రైవేటు బీమా సంస్థలు	24442	32.62	45.47	33.95

జనవరి 31, 2002 సాధారణ బీమా ప్రీమియం వసూళ్ళు

జాతీయ సాధారణ బీమా సంస్థలు	రు. 10,200.00 కోట్లు
ప్రైవేటు సాధారణ బీమా సంస్థలు	రు. 856.00 కోట్లు

జీవిత బీమా సంస్థ ప్రపంచంలోనే మొదటి రాంక్ జాతీయ జీవిత బీమా సంస్థ

క్లైములు	86.55 లక్షలు
సేవ చేసే పాలసీలు	12.81 కోట్లు
ఏజెంట్లు	7.92 లక్షలు
2001-02 కొత్త పాలసీలు	2.32 కోట్లు

❑

(6వ పేజీ తరువాయి)

ఉద్యమంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూగర్భంలోకి నీరింకలేదు, గాని కాంట్రాక్టర్ల కడుపుల్లోకి వందల కోట్ల ప్రజాధనం ఇంకిపోయింది. ప్రకృతి ప్రసాదించిన సహజ ఫిల్టర్ బెడ్‌లైన వాగులు, ఏర్లలోని ఇసుక రోజువేల లారీల్లో నగరానికి తరలిస్తుంటే చోద్యం చూస్తున్న సర్కారు, పట్టణాల్లో సిమెంట్ తారు రోడ్లమధ్య కృత్రిమ ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం ద్వారా భాగర్భ జలాలను ఇంకించే కార్యక్రమాన్ని కొనసాగిస్తుంటే చూస్తున్న మనకు, మనం తుగ్లక్ పరిపాలనలో వున్నామేమోనన్న భ్రమ కలగడం ఆశ్చర్యమేం కాదు. ఈ డబ్బును చిన్ననీటి పారుదలకు ఖర్చుచేసినా 30 లక్షల ఎకరాలకు సాగునీరందేది. లేదా చెక్‌డ్యాంలు, ఊట చెరువులు నిర్మించినట్ల యితే లక్ష ఊట చెరువులకు తోడ్పడేది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలెదుర్కొంటున్న తీవ్ర నీటి ఎద్దడికి, పైగా భూగర్భ జలమట్టం పడిపోవడానికి ఇసుక రవాణా కారణం కాదని చెప్పేధైర్యముందా ప్రభుత్వానికి?

మొత్తం మీద ప్రభుత్వాలు అటు భారీ మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేయకుండా ఇటు చిన్ననీటి పారుదల వ్యవస్థనూ అభివృద్ధి పరచకుండా ఎప్పటికప్పుడు కాలాన్ని దాటిస్తూ ప్రజలముందు కరువు కరువనే కలవరింత నాటకాన్ని ఎంత బాగా రక్తి కట్టించినా ప్రజల్ని మెప్పించి ఒప్పించలేమని గుర్తిస్తే మంచిది.

ఇప్పటికిప్పుడు అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం భారత్‌లో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడానికి అనుమతినిస్తే, అంతర్జాతీయ సంస్థల వద్ద అడ్డమైన షరతులకు తలొగ్గైనా వేలాదికోట్ల రూపాయలను అప్పులుగా తెచ్చి మిగతా రాష్ట్రాలతో పోటీ పడి ఆంధ్రప్రదేశ్‌లో ఒలింపిక్స్ క్రిడలను నిర్వహించే సత్తాని చాటుకోవడానికి బడాయి పోతున్న ప్రభుత్వానికి, రాష్ట్రంలో శాశ్వత కరువుల్నుండి ప్రజల్నాదుకునే ఆలోచనగాని, లక్ష్యం గాని లేకపోవడం ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. ❑

ఎవరి యుద్ధమిది? ఎవరి కోసమిది?

(గత దశాబ్దంలో 1991లో ఇరాక్‌మీద అమెరికా చేసిన యుద్ధం సందర్భంగా ఆధునిక సాహిత్యవేదిక 'సృజన' ప్రచురించిన వ్యాసం ఇది)

ధాత్రీ జనని గుండెమీద
యుద్ధపు కొరకంచుల ఎర్రని రవ్వలు
మీరెవరైనా చూశారా
కన్నీరైనా విడిచారా
కోటి కోటి సైనికుల ఊడిపడిన
కనుగ్రుడ్ల అద్దాలలో ప్రతిఫలించే నిజాలను
మీరెపుడైనా చూశారా - తిలక్

'సామ్రాజ్య' వాదమంటేనే యుద్ధం అని లెనిన్ చెప్పిన మాట మరోసారి పశ్చిమాసియా రంగంమీద రుజువవుతోంది. సామ్రాజ్యవాదం ఇప్పుడు మాటలు నేర్చిన గద్ద రూపంలో వచ్చింది గనుక ఎన్నెన్నో చిలక పలుకులూ వినబడుతున్నాయి. శాంతి, న్యాయం, ప్రజాస్వామ్యం, దురాక్రమణనుంచి విముక్తి, చిన్న దేశాలమీద, పెద్ద దేశాల పెత్తనం వంటి పెద్ద మాటలన్నీ అర్థం కోల్పోయి అమెరికా అధ్యక్షుడి ప్రసంగాల్లో దొర్లుతున్నాయి. సామ్రాజ్యవాదం చేతిలో ఆయుధ వ్యాపారులు మాత్రమే గాక అక్షర వ్యాపారులూ ఉన్నారు గనుక ప్రపంచ ప్రచార సాధనాలన్నీ కట్టుకథల్ని ప్రకటించే కర్తవ్యాన్ని ఎంచుకుంటున్నాయి. డబ్బున్న దేశాల దీపావళిలో కోట్లాది రూపాయల సంపద రోజురోజూ బుగ్గి అయిపోతోంది. హింసా ప్రవృత్తికి అతి పెద్ద నిదర్శనంగా ఈ మారణకాండను సజీవంగా టెలివిజన్ తెరకెక్కించి ప్రపంచ ప్రజల ముందు ప్రదర్శిస్తున్నారు. అచ్చులోనూ, దృశ్యంలోనూ కూడా అబద్దాల్ని ప్రచారంచేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఈ అన్ని రకాల అబద్ధాల మధ్యనుంచి అసలు వాస్తవాల్ని గ్రహించవలసి ఉంది. జార్జిబుష్ కళ్ళలోంచో, సద్దాం హుస్సేన్ కళ్ళలోంచో కాక పేదదేశాల ప్రజల కళ్ళలోంచి ఈ యుద్ధాన్ని గుర్తించవలసి ఉంది. ఎవరు తెచ్చిన యుద్ధమిది? ఎవరి అవసరాల కోసం సాగుతున్న యుద్ధమిది?

"కువైట్‌లో సక్రమమైన ప్రభుత్వం తిరిగి ఏర్పడే వరకూ" "కువైట్ విముక్తమయ్యేవరకూ" ఈ యుద్ధం సాగుతుందని అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ యుద్ధ ప్రారంభం రోజున ప్రకటించాడు. నిజంగా ఈ యుద్ధం కువైట్‌కోసం మాత్రమే మొదలై, కువైట్ కోసమే జరుగుతోందా?

ఇది యుద్ధాలన్నిటికీ తల్లిలాంటి యుద్ధమనీ, ఈ యుద్ధంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాని మిత్ర రాజ్యాలకూ చెపుతామని ఇరాక్‌అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ప్రకటించాడు. నిజంగా సద్దాంహుస్సేన్ అమెరికన్‌సామ్రాజ్యవాదాన్ని ఎదిరించేందుకే ఈ యుద్ధంలో దిగాడా?

1990 ఆగస్ట్ 2న పొరుగు దేశమైన కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడంతో ప్రారంభమైన ఘర్షణ చివరికి 1991 జనవరి 16న పూర్తిస్థాయి యుద్ధంగా మారిందని పాశ్చాత్య పత్రికలు, వాటిని అనుసరించే భారతీయ పత్రికలు రాస్తున్నాయి. ఇది అబద్ధం కాదు గాని అర్థసత్యమే. కువైట్‌మీద ఇరాక్ జరిపిన దురాక్రమణ ఈ యుద్ధానికి ఒక సాకు మాత్రమే. అంతకన్న ముఖ్యమైన ఆర్థిక, రాజకీయ, సైనిక, కారణాలు ఈ యుద్ధాన్ని ప్రేరేపించి కొన సాగిస్తున్నాయి.

బడుగుదేశాల సహజ వనరులమీద ఆధిపత్యం ఎవరిదన్న ప్రశ్నకూడా ఈ యుద్ధంలో ప్రముఖంగా ముందుకువస్తున్నది. దక్షిణార్థ గోళంలోని దేశాల భూగర్భంలోనే అతి ఎక్కువ సహజ వనరులు, ఖనిజాలు ఉండడం, వాటిని దోపిడీచేసే అగ్రరాజ్యాలు ఉత్తరార్థగోళంనుంచి పెట్టుబడులతో, రాజకీయాలతో ఆధిపత్యం చెలాయించడం చాలాకాలంగా చర్చనీయాంశంగానే ఉంటున్నది. ఇప్పుడు అగ్రరాజ్యాలకు ఉండాలా అనే ప్రశ్న బలంగానే ముందుకు వచ్చింది. మసాచుసెట్స్‌లో ఒక యుద్ధ వ్యతిరేక సభలో మాట్లాడుతూ నోమ్ చామ్‌స్కీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి సామ్రాజ్య వాదం ప్రపంచంలోని సహజ వనరులన్నీ తనవేనని అనుకుంటుందని, అవి ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉండడం ఒక 'భౌగోళిక యాదృచ్ఛికత' అనుకుంటుందనీ ఆయన అన్నాడు!

చముదు దొరల ప్రయోజనాలు, ఆయుధ ఉత్పత్తిదారుల ప్రయోజనాలు, కువైటీ, అమెరికన్ ద్రవ్య పెట్టుబడిదారుల ప్రయోజనాలు కలగలసి ఈ యుద్ధానిక కారణమయ్యాయి. ఈ ప్రయోజనాలమధ్య ఘర్షణస్త్ర జార్జిబుష్, సద్దాం హుస్సేన్‌ల చర్యల్లో రాజకీయ వ్యక్తీకరణ పొందుతోంది.

కేవలం చమురు ఉత్పత్తి గణాంకాలనే చూస్తే కువైట్ ఏమంత పెద్ద దేశం కాదు. 1989లె అక్కడ మొత్తం చమురు ఉత్పత్తి తొమ్మిదికోట్ల టన్నులు. ఈ మాత్రం చమురు వార్షిక ఉత్పత్తి

బ్రిటన్, వెనిజులల్లో కూడా జరుగుతుంది. కాని కువైట్ చమురుమీద ఇరాక్‌కు ఆధిపత్యం వస్తే, ఇరాక్ చమురు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. కువైట్‌ను ఆక్రమిస్తే ఇరాక్ వార్షిక ఉత్పత్తి పదమూడు కోట్ల తొంబై లక్షల టన్నులవుతుంది. అట్లా ప్రపంచ చమురు ఉత్పత్తిదారుల జాబితాలో నాలుగో స్థానంలో నిలువగల మహాశక్తిగా ఆవిర్భవిస్తుంది. కువైట్‌ను ప్రత్యేక దేశంగా తయారు చేసినప్పుడు బ్రిటిష్ వలసవాద పాలకులు ఈ ప్రయోజనాన్నే ఆశించారు. సింధుశాఖలో చమురు ఉత్పిత్తిలో బలీయమైన శక్తేదీ తలెత్తి నిలవగూడదనేదే వాళ్ళ లక్ష్యం.

ఇరాక్-కువైట్ ఏకీకరణ బలం ఇతర రంగాలలో మరింత ప్రస్ఫుటంగా కనబడుతుంది. కువైట్ ఆక్రమణతో ఇరాక్ ప్రపంచ క్రూడాయిల్ ఎగుమతిదార్ల జాబితాలో రెండో స్థానానికి వస్తుంది. ప్రపంచ చమురు నిల్వలలో పావు వంతు ఇరాక్‌లోనే ఉంటాయి. ఒకవైపు అమెరికన్ చమురు నిల్వలు ఈ శతాబ్దాంతానికి, ఉత్తర సముద్ర జలగర్భంలో చమురు నిల్వలు ఇంకో 14 సంవత్సరాలకు అయిపోతుండగా మరోవైఉ కువైట్ భూగర్భంలో మాత్రం ప్రపంచ నిలువల్లో పదో వంతు చమురు ఉంటుంది.

ఇరాక్ కువైటల్‌లను పక్కన పెట్టినా మిగిలిన సింధుశాఖ దేశాల పరిస్థితీ ఇంత ఆశాజనకంగానే ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే తెలిసిన చమురు నిల్వల్లో 34 శాతం సౌదీ అరేబియాలోనే ఉన్నాయి. సింధుశాఖ దేశాలన్నిట్లో కలిపితే ఈ నిలువలు 60 శాతం, ఇరాక్, కువైట్‌లను కూడా కలుపుకుంటే ఈ నిల్వలు 85 శాతం. అంతేగాక, 1974 తర్వాత కొత్తగా కనిపెట్టిన ప్రతి చమురు నిక్షేపమూ దాదాపుగా పశ్చిమాసియాలోనే బయట పడింది. భవిష్యత్ అన్వేషణలు కూడా ఈ ప్రాంతంలోనే సఫల మయ్యే అవకాశం ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, చమురు ఉత్పత్తి, ఎగు మతులు, వెలికితీయని నిల్వల విషయంలో సింధుశాఖ ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యత ఉంది. ఇంత కీలకమైన ప్రాంతం గనుకనే కువైట్‌ను ఇరాక్ ఆక్రమించుకోవడంతో పరిణామాల వరుస వేగవంతమైంది.

కువైట్‌కు ఇరాక్‌కు మధ్య ఘర్షణలు ఇవాల్టివి కావు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఆటోమన్ సామ్రాజ్యం పతనమైన తర్వాత పశ్చిమాసియాలో అన్ని దేశాల మధ్య సామ్రాజ్యవాదులు తమ ఇష్టానుసారం సరిహద్దు రేఖలు గీశారు. తమ భూభాగాన్ని పొరుగు దేశంలో కలిపేశారని ఆరోపించని దేశమేదీ పశ్చిమాసియా లో లేనంతగా ఈ పునర్విభజన జరిగింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత మరొకసారి సరిహద్దు రేఖలు గీయడం, కొత్తగా ఇజ్రాయెల్‌ను ఏర్పర్చడం పశ్చిమాసియాను మరింత కల్లోలం చేశాయి. 1923 నుంచి 1961 వరకు బ్రిటిష్ రక్షిత ప్రాంతంగానూ, 1961 నుంచి రాజ్యాంగ బద్ధమైన రాచరికంతో, "స్వాతంత్ర్యం" పొందిన దేశంగాను కువైట్ సింధుశాఖలో సామ్రాజ్యవాద కువైట్‌లో నిరంకుశ ఎమీర్ కుటుంబపాలనను కొనసాగనిచ్చారు. కువైట్‌లో కొంత భూభాగం తనదేనని ఇరాక్ - చాలకాలంగానే ఫిర్యాదు చేస్తూ వస్తోంది.

ఇది ఇట్లా ఉండగా, కువైట్ ఎమిర్ సాగిస్తున్న చర్యలు ఇరాక్ ప్రభుత్వానికి అభ్యంతకరంగా తయారయ్యాయి. చమురు ఎగుమతి చేసే దేశాల నిబంధనలు విధిస్తే, కువైట్ ఆ నిబంధనల్ని ఉల్లంఘించింది. అమెరికా వత్తాసుతో కువైట్ తన కోటా కన్న ఎక్కువ చమురును ప్రపంచ మార్కెట్‌లోకి పంపించడంతో మార్కెట్‌లో చమురు ధర పడిపోవడం మొదలైంది. ఇరాన్‌తో ఎనిమిది సంవత్సరాల యుద్ధం తర్వాత తాను తన ఆర్థిక వ్యవస్థను పునరద్ధరించుకుంటూన్ననీ, ఈ ధరల తగ్గింపు తన మీద ప్రతికూల ప్రభావం వేస్తుందనీ, ఇరాక్ వాదిస్తోంది. క్రూడాయిల్ ధరలో బారెల్‌కు ఒక డాలర్ పడిపోయినా, తనకు సంవత్సరానికి వందకోట్ల డాలర్ల నష్టం వస్తుందని ఇరాక్ అంటోంది. కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడానికి పునాదిగా పని చేసిన వివాదం ఇదే కావచ్చు. కాని, ఇరాక్ అధికారికంగా చెప్పిన కారణాలలో ఇది లేదు.

పాలక అల్‌సబా కుటుంబాన్ని కూలదోసిన విప్లవకారులు, తనను ఆహ్వానించారనీ, కువైట్ విదేశాంగ మంత్రి అమెరికన్ ఏజంటనీ, తన చమురు క్షేత్రాలలోంచి కువైట్ చమురు దొంగిలిస్తోందనీ, తనకు వ్యతిరేకంగా కువైట్ సైనిక కార్యకలాపాలకు పూనుకుంటోందని ఇరాక్ ప్రభుత్వం ప్రకటించింది.

ఇవన్నీ నిజమే అయినా కువైట్ మీద దురాక్రమణ సాగించే హక్కు ఇరాక్‌కు లేదు. కాని సద్దాం హుస్సేన్ పాలనలో ఇరాక్ గత రెండు దశాబ్దాలుగా విపరీతంగా సైనికీకరణ పొందింది. పశ్చిమాసియాలో ప్రబలమైన సైనిక శక్తిగా అవతరించింది. ఇటు సోవియట్ యూనియన్ నుంచి బహిరంగంగాను, పాశ్చాత్య దేశాల నుంచి వేరు వేరు మార్గాలలోను ఇరాక్ ప్రభుత్వం కుప్పలు తెప్పలుగా ఆయుధ సమీకరణ చేసుకుంది. ప్రత్యేక కుర్దిస్తాన్ కోసం మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం వెలుగులో పోరాడుతున్న కుర్దుల మీద విషవాయువుల్ని, రసాయనిక ఆయుధాల్ని ప్రయోగించడంతో సహా దారుణ దమనకాండకు పాల్పడింది. ఇరాన్‌తో ఎనిమిది సంవత్సరాల పాటు యుద్ధం సాగించి ఆయుధ ఉత్పత్తిదార్ల పంట పండించింది.

మరో మాటల్లో చెప్పాలంటే దక్షిణాసియాలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి విస్తరణ వాద వ్యూహాన్నే, పశ్చిమ ఆశియాలో ఇరాక్ అనుసరిస్తూ వచ్చింది. సోవియట్ యూనియన్ భారతదేశాన్ని సమర్థించినట్టుగానే ఇరాక్‌నూ సమర్థిస్తూ వచ్చింది.

కువైట్‌ను ఇరాక్ దురాక్రకమించడం తప్పనీ, ఇరాక్ వెంటనే కువైట్ నుంచి వైదొలగాలని ప్రపంచ వ్యాప్తంగా చెలరేగింది. ఈ న్యాయమైన నిరసనను తన దుర్మార్గ విధానాల కోసం వినియో

గించుకోవాలని అమెరికన్, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సమావేశపరిచి అతి తక్కువ వ్యవధిలో ఇరాక్‌కు వ్యతిరేకంగా అతి ఎక్కువ తీర్మానాలు చేయించారు. ఇరాక్‌పైన ఆర్థిక ఆంక్షలు విధించారు. జనవరి 15లోగా కువైట్ నుంచి వైదొలగకపోతే 'ఇతర చర్యలు చేపట్టవలసి వస్తుందని' హెచ్చరించారు. ఈ మొత్తం క్రమంలోనూ ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశాన్ని ఎప్పుడూ ఏర్పరచలేదు. ఈ అన్ని నిర్ణయాలూ పదిహేను మంది సభ్యులున్న భద్రతా మండలే తీసుకుంది. "ఇతర చర్యల" గురించి హెచ్చరించిన తీర్మానాన్ని సోవియట్ యూనియన్ కూడా సమర్థించగా చైనా ఎటూ వోటు వెయ్యలేదు. క్యూబా, యెమెన్‌లు వ్యతిరేకంగా వోటు వేశాయి. అంటే, ప్రపంచ ప్రజాభిప్రాయానికే ఐక్యరాజ్యసమితి ప్రాతినిధ్యం వహిస్తుందా అనే అనుమానం ఉండగా, ఆ ఐక్యరాజ్యసమితిలో కూడా కేవలం పన్నెండు దేశాల నిర్ణయం ప్రకారం ఇరాక్‌కు హెచ్చరిక జారీ అయ్యింది, ఈ హెచ్చరిక యుద్ధం గురించి ఏమీ మాట్లాడక పోయినా, అమెరికా, బ్రిటన్‌లు సైనిక సమీకరణను, యుద్ధపు ఏర్పాట్లను వెంటనే ప్రాంభించాయి.

ఇక్కడ ఒక్క క్షణం ఆగి ఈ యుద్ధోన్మాదుల అసలు రంగు తెలుసుకోవలసి ఉంది. ప్రపంచంలో ఒక దేశాన్ని మరో దేశం దురాక్రమించడం ఇదే మొదటిసారి కాదు. పాలస్తీనా ఇజ్రాయిల్ ఆక్రమించి తిష్టవేసుకుని కూచుని ఉంది. గ్రెనడా, పనామాలను అమెరికా ఆక్రమించింది. లిబియా మీద దౌర్జన్యపూరిత దాడి జరిపింది. వియత్నాం మీద అనేక సంవత్సరాలపాటు దుర్మార్గమైన యుద్ధం చేసింది. సోవియట్ యూనియన్ చెకొస్లవేకియా మీద దాడి జరిపింది. ఆఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించింది. భారతదేశం సిక్కింను ఆక్రమించింది. దక్షిణాఫ్రికాలో ఆక్రమణదారుల పాలనే కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి దురాక్రమణల జాబితాకు అంతులేదు. ఈ దురాక్రమణలు వేటిలోనూ ఐక్యరాజ్య సమితి నిర్ణయాత్మకమైన పాత్ర వహించలేదు సరిగదా, అమెరికా, బ్రిటన్, సోవియట్ యూనియన్‌లు తమ వీటో అధికారాన్ని ఉపయోగించి దురాక్రమణదారుల్ని కాపాడుతూ వచ్చాయి. ఇటువంటి భద్రతా మండలికీ, ఐక్యరాజ్యసమితికీ, అగ్రరాజ్యాలకూ ఇరాక్‌ను వేలెత్తి గుర్తించగానే, అమెరికన్ బృందగానం ఐక్యరాజ్య సమితి కీర్తనలు ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితిని ఎన్నడూ గౌరవించని, ఎన్నోసార్లు ఉల్లంఘించిన అగ్రరాజ్యాలే ఐక్యరాజ్య సమితి ఎంత గొప్పదో, ఎంత అనుల్లంఘనీయమో ప్రకటించాయి.

ఈ యుద్ధోన్మాద కుట్రలను గుర్తించిన ప్రజానీకం చాల దేశాల్లో యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలను ప్రారంభించారు. ఇరాకీ విస్తరణవాదాన్ని ఖండిస్తూనే, ఆ సాకుతో యుద్ధం తేనున్న సామ్రాజ్య వాద కుటిల పన్నాగాలను తిప్పి కొట్టడానికి ప్రయత్నించారు. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రభుత్వ వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగాయి. మరో వైపు శాంతి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి, ఇరాక్-కువైట్ సమస్యను అరబ్ ప్రజల ఆంతరంగిక సమస్యగా గుర్తించాలనీ, దానిలో జోక్యం చేసుకునే హక్కు సామ్రాజ్యవాదులకు కాని అమెరికనాకూ, బ్రిటన్‌కూ ఇతర సామ్రాజ్యవాద దేశాలకూ లేదనీ ప్రపంచ ప్రజల ముక్తకంఠం తో ప్రకటించారు. అయినా సామ్రాజ్యవాదానికి ఇప్పుడు యుద్ధం అత్యవసరం. కువైట్ నుంచి ఇరాక్ సేనలను ఉపసంహరింప జేయడమో, కువైట్‌లో ప్రజాభీష్టం ప్రకారం ప్రభుత్వాన్నేర్పరచడమో అగ్రరాజ్యాల లక్ష్యం కాదు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనేక కీలక స్థానాల్లో కువైటీ పెట్టుబడులున్నాయి. 'కువైటీ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీస్' అనే సంస్థ ద్వారా ఆసగిన ఈ పెట్టుబడుల్లో సగం ఎమిర్, అతని కుటుంబ సభ్యుల విదేశీ పెట్టుబడులే. ప్రస్తుత జర్మనీ ఆర్థిక వ్యవస్థకు పునాది అయిన ఒక అర్ధ-సైనిక కంపెనీలో ఐదోవంతు పెట్టుబడులు ఎమీర్ రాజకుటుంబానివే. జపాన్‌లో అతి పెద్ద విదేశీ పెట్టుబడిదారు ఎమీరే. అమెరికాలో మూడువేల కోట్ల డాలర్ల మేరకు కువైటీ ఆస్తులున్నాయి. 1990 చివరి నాటికి అమెరికా ఇతర దేశాలకు డెబ్భైవేల కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతుంటారని తెలుస్తోంది అంతేకాదు, కువైటీ షేక్‌లకు ఇప్పుడు చమురుమీద వచ్చే ఆదాయంకన్న, పెట్టుబడులపై వచ్చే లాభాలే ఎక్కవ.

పశ్చిమాసియాలోనే పేద దేశాలూ, నిరుపేద ప్రజానీకమూ ఎందరో ఉండగా, ఈ సంపన్న దేశాల షేక్‌లు, అమీర్‌లు, రాజులు చమురుద్వారా సంపాదించిన కోట్లాది డాలర్ల ధనాన్ని తమ విలాసా కోసమూ, పాశ్చాత్య దేశాల్లో పెట్టుబడుల కోసమూ వాడుతున్నారు. తద్వారా ప్రపంచ రాజకీయ, సైనిక పరిణామాల మీద ప్రభావం చేస్తున్నారుగాని, అందువల్ల నిరుపేద అరబ్ ప్రజానీకాకేమీ లాభం లేదు.

ఈ ఆర్థికకోణం యుద్ధాన్ని త్వరితం చేసింది.

మరోవైపు పాశ్చాత్య ఆయుధవ్యాపారుల ప్రయోజనాలు ఈ యుద్ధానికి అవకాశం కలిగించాయి. 1973-74 నుంచి ఈ ఆయుధ వ్యాపారులు తమ వ్యాపారాన్ని సింధుశాఖలోనే ఎక్కువగా జరిపి, ఆయిల్ డాలర్ల రుచి మరిగారు. అత్యాధునికమైన, అతి ఖరీదయిన యుద్ధయంత్రాంగం పశ్చిమాసియాలో దిగడం, మొదలయ్యింది. ఇరాన్-ఇరాక్ యుద్ధసమయంలో ఒకే వ్యాపారులు, ఒకే యుద్ధసామగ్రిని ఇరుదేశాలకూ అమ్మారే విషయం కూడా బైటపడింది. ప్రపంచ ఆయుధమార్కెట్‌లో అమ్ముడవుతున్న ఆయుధాలలో సగం ఈ రెండు దేశాలే కొనుక్కుంటున్నాయని 1987లో తేలింది. పాశ్చాత్య దేశాలు యుద్ధ సామగ్రిని సింధుశాఖ దేశాలకు అమ్ముతూ, బదులుగా తక్కువ ధరలకు చమురు కొనుక్కునే ఒప్పందాలను కూడా చేసుకున్నాయి. ఒక్క సౌదీఅరేబియానే 15 సంవత్సరాల కాలంలో ఇరవై వేల కోట్ల డాలర్ల ఆయుధాల్ని కొనుక్కుందంటే, ఆయుధ వ్యాపారం ఎంత పెద్ద ఎత్తున సాగిందో అర్థమవుతుంది.

అగస్టులో ఈ ప్రాంతంలో ఘర్షణ ప్రారంభంకాగానే మరొక సారి ఈ ఆయుధ వ్యాపారుల పంట పండింది. అన్ని సింధు శాఖ దేశాలనుంచీ ఆయుధాల కోసం ఆర్డర్లు వచ్చిపడ్డాయి. ఈ ఆర్డర్ల విలువే రెండువేలకోట్ల డాలర్లు కాగా, ఆ ఆయుధసామగ్రి నిర్వహణ మరెన్నో రెట్లుంటుంది.

ఈ ఆయుధ వ్యాపారులకు ఒక రాజకీయ కోణం కూడా ఉంది. రాగన్ ఆర్థిక విధానాలకు సోవియట్ యూనియన్ బూచి చూపి సమర్ధన చెప్పుకునే అవకాశం ఉండేది. కాని గోర్బచేవ్ తర్వాత సోవియట్ యూనియనే తన ఆంతరంగిక కల్లోలాలను పరిష్కరించుకునే ప్రయత్నంలో పడిపోగా, తూర్పు యూరప్‌లో సోవియట్ పట్టుసడలిపోగా, అమెరికన్ రక్షణ వ్యయాన్ని తగ్గించక తప్పని పరిస్థితి వచ్చింది. ఈ స్థితిలో మరొక బూచినీ, మరొక సైనిక మోహరింపు అవసరాన్నీ ఆయుధ వ్యాపారులు గుర్తించారు. సరిగ్గా ఆ పని చేసి పెట్టేందుకు సద్దాం హుస్సేన్ అవతరించాడు.

ఈ రకంగా అనేక ప్రవాహాలు కలగలసి యుద్ధాన్ని అనివార్యం చేశాయి. సామ్రాజ్యవాదం ఉన్నంతకాలం యుద్ధం అనివార్యం అవుతుందనేది ఇన్ని కారణాల వల్ల కూడా రుజువైంది.

జనవరి 15కు ముందే శాంతి ప్రతిపాదన సాధ్యమయ్యే అవకాశం ఉన్నప్పటికీ ఈ కారణాలవల్లనే సామ్రాజ్యవాదులు యుద్ధాన్నే ప్రారంభించారు. రోజుకు రెండువందల కోట్లరూపాయలు ఈ యుద్ధంలో దగ్ధమైపోతున్నాయని ఒక అంచనా. నిజానికి యుద్ధంలో ఖర్చులు తగ్గించి చెపుతారు గనుక కనీసం రెట్టింపు సంపద ఈ యుద్ధంలో బుగ్గిపాలు అయిపోతూ ఉండవచ్చు.

యుద్ధానికి రోజులు దగ్గర పడుతున్నకొద్దీ సద్దాం హుస్సేన్ ఈ సమస్యను అరబ్-ఇజ్రేల్ ఘర్షణగా చిత్రించడం ప్రారంభించాడు. పశ్చిమాసియాలో అక్రమంగా పాలస్తీనియన్లను స్వస్థలాలనుంచి వెళ్ళగొట్టిన ఇజ్రాయెల్ దురాక్రమించిన భాగాలను వదులుకుంటే తన సేవలను కువైట్‌నుంచి ఉపసంహరిస్తానన్నాడు. ఇరాక్‌కు ఓడ రేవులు కల్పించుకోవడానికి వీలుగా సింధుశాఖలో రెండు చిన్న దీవుల్ని ఇమ్మని అడిగారు. నిజానికి ఈ రెండు కోర్కెలూ ప్రపంచ రాజకీయాల నేపథ్యంనుంచి, చిన్నాభిన్నమైన ఇరాకీ ఆర్థిక వ్యవస్థ నేపథ్యం నుంచి చూస్తే న్యాయమైన కోర్కెలే. కాని సామ్రాజ్యవాద యుద్ధోన్మాదులకు ఈ ఘర్షణలో న్యాయాన్యాయాలతో నిమిత్తం లేదు. వారి కోరికల్లా సింధుశాఖలో తమ తొత్తుగా కువైట్ యథాతథంగా ఉండడం, ఆయుధ వ్యాపారం ఇతోధికంగా కొనసాగడం.

అందువల్లనే జనవరి 16న యుద్ధం ప్రారంభమైంది. యుద్ధం దగ్గర పడుతుండగా సద్దాం హుస్సేన్‌తో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి జరిపిన చర్చల్లో నిజానికి సద్దాం హుస్సేన్ ఇచ్చిపుచ్చుకునే వైఖరిని ప్రదర్శించాడని యుద్ధం మొదలైన వారానికి బైటపెట్టారు.

ఈ రాజకీయ కుట్రలు, తారీఖులు, దుస్తావేజులు ఎట్లా ఉన్నా, అంతిమంగా యుద్ధ దుష్పరిణామాలకు గురయ్యేది ప్రజలు. ఆధునిక కాలంలో రవాణాకు అత్యవసరమైన చమురు ఈ యుద్ధంలో ఆవిరి అయిపోతోంది. యుద్ధం ముగిసినా, ముగియకున్నా చమురు ధరలు విపరీతంగా పెరుగుతాయి. అంటే సరుకుల రవాణా ఖర్చులు పెరిగి సరుకుల ధరలన్నీ అనేక రెట్లు పెరిగిపోతాయి. ఇప్పటికే చమురు ట్యాంకర్లు పగిలి సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి గనుక దాని పర్యావరణ ఫలితాలు ప్రమాదకరంగా ఉంటాయి. ఈ యుద్ధంలో రసాయినిక ఆయుధాలు, క్రిమి ఆయుధాలు, అణ్వాయుధాలు వాడుతామనే బెదిరింపులు ఇప్పటికే వస్తున్నాయి. ఆ ఆయుధాలను అంతిమంగా ప్రయోగిస్తే ప్రపంచ వ్యాప్తంగానే ప్రజల ఆరోగ్యాలకు, ప్రాణాలకు, భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది.

ఇంత దుర్మార్గమైన, అవసరమైన ఈ యుద్ధాన్ని నివారించడానికి ఏ ప్రయత్నమూ చెయ్యని 'అలీనోద్యమం' తన సహజమైన అశక్తతను స్పష్టంగానే తెలియజెప్పింది. అసలు నిజానికి అలీనమైన ప్రభుత్వమేదీ లేదని యుద్ధపరిణామాలు రోజు రోజూ రుజువు చేస్తున్నాయి. ఈ క్రమంలో నిస్సిగ్గుగా తన స్వభావాన్ని బహిర్గతం చేసుకున్నది భారత ప్రభుత్వం. మొదట యుద్ధం గురించి సోవియట్ యూనియన్ వైఖరి స్పష్టం కాలేదు. గనుక భారత ప్రభుత్వం కూడా తన వైఖరి ప్రకటించలేదు. యుద్ధాన్ని ఆపాలని ఒక శాంతి ప్రవచనం చేసి, కువైట్ నుంచి ఇరాక్ వైదొలగాలంటూ సోవియట్ యూనియన్ ప్రకటించగానే భారత ప్రభుత్వమూ అటువంటి ప్రకటనే చేసింది. ఈ వైఖరికి సంతోషించిన సామ్రాజ్యవాద పెద్దలు భారత ప్రభుత్వానికి వెంటనే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ రుణం నాలుగువేల కోట్ల రూపాయలు మంజూరు చేశారు. భారత ప్రభుత్వం మరింత కృతజ్ఞతతో అమెరికన్ యుద్ధ విమానాలకు బొంబాయి, మద్రాసు, నాగపూర్‌లలో ఇంధనం నింపింది. బొంబాయి ఓడరేవులో అమెరికన్ యుద్ధనౌకలను ఆగనిచ్చింది. అట్లా యుద్ధం మన తీరం నుంచి సాగడానికి భారత ప్రభుత్వం అన్ని అవకాశాలూ కల్పించింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలన్నీ, ఇటువంటి వైఖరినే తీసుకుంటుండగా ప్రజలు మాత్రం అంతకంతకూ ఎక్కువగా యుద్ధాన్ని నిరసిస్తూ వీదుల్లోకి రావడం ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రజలలో వ్యక్తమైన సామ్రాజ్యవాద వ్యతిరేకత సద్దాం హుస్సేన్ పట్ల అనుకూలతగా కూడ పరిణమిస్తోంది. సద్దాం హుస్సేన్ యుద్ధ క్రమంలో దృఢమైన సామ్రాజ్యవాద వ్యతిరేకతను ప్రచారం చేయడం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం. యుద్ధాన్ని వెంటనే ఆపివేసి ఆస్తినష్టాన్ని, జన నష్టాన్ని నివారించాలని, పాలస్తీనా నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలని, కువైట్ నుంచి ఇరాక్ వైదొలగాలని, పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు పశ్చిమాసియాలో ప్రజలు చొరవతో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయవలసి ఉంది.

('సృజన, జనవరి / ఫిబ్రవరి 1991) ❑

ఫిబ్రవరి 16 - 28, 2003

రాష్ట్రం

16. అయోధ్యపై చర్చ : ఢిల్లీ పిలుపు మేరకు ముఖ్యమంత్రి పయనం.

17. శాసనసభా సమావేశాలు ప్రారంభం

18. 'జనశక్తి' పార్టీని నిషేధిస్తాం - డి.జి.పి.

ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు - ప్రభుత్వ నిర్ణయం.

రు. 342 కోట్లతో గోదావరి జలాలు విశాఖకు తరలింపు.

19. 2001లో దొంగ పాస్‌పోర్ట్‌లు (61) ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం.

20. 2220 మంది అధికారులు, ఇంజనీర్ల అసమర్థతపై ముఖ్యమంత్రికి సాంకేతిక సలహా దారు నివేదిక ఇస్తే 70 మంఇపై మాత్రమే చర్య - మైసూరా రెడ్డి.

21. సోనియాపై ముఖ్యమంత్రి, హోంశాఖా మంత్రి వ్యాఖ్యలతో శాసనసభలో గంటపైగా స్థంభన.

ఆటో డ్రైవర్ల 4 రోజుల సమ్మె విరమణ

నిరసనల మధ్య గవర్నరు ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఆమోదం

21. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మాతృభాషపై సభ.

హైదరాబాద్, చెన్నైల్లో ప్రముఖుల ఇళ్ళపై ఆదాయపు పన్ను శాఖ దాడులు.

22. రు. 2131.5 కోట్ల రెవెన్యూ లోటుతో 2003-04 బడ్జెట్ ప్రతిపాదన.

25. కరువు జన్మభూమి ప్రారంభం.

సహకార పంచదార పరిశ్రమల ప్రైవేటీకరణ : హైకోర్టులో పిటీషన్ కొట్టివేత

బయోటెక్నాలజీ కోర్సులు ప్రారంభించడానికి వ్యవసాయ విద్యాలయానికి రు. 2.5 కోట్లు.

26. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు 25 సం. రాజకీయ జీవితం పూర్తి.

దేశం

17. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం.

18. బిస్లరీ, పెప్సీతో సహా వాటర్ బాటిల్ తయారీ దార్లకు అనుమతి రద్దు

100-150 మంది సిఇఓఎస్ కు సంవత్సరం జీతం ఒక్కొక్కరికి కోటి రూపాయలు పైనే

ఐ.ఓ.ఎల్, ఒ.ఎన్.జి.సి. గెయిల్ ప్రభుత్వ రంగంలోనే వుంటాయి. -అరుణ్‌శౌరీ

జనవరి 2003 వరకు డంపింగ్‌కు పాల్పడిన 47 దేశాలపైన కేసుల నమోదు

20. గుడి కట్టాలనే వుంది - వాజ్‌పాయ్.

రు. 300 కోట్లతో ధరం స్థిరీకరణ నిధి.

'పోటా' పై దద్దరిల్లిన లోక్ సభ

21. పార్లమెంట్‌లో ప్రధాని హిందూత్వ ప్రకటనపై దుమారం

అయోధ్యపై మార్చి 6కు సుప్రీం కోర్టు విచారణ వాయిదా.

ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ ఊరేగింపు హింసాత్మకం

25. పార్లమెంటు భవనంలో గాంధీజీ హత్య కేసులో ముద్దాయి సావర్కార్ విగ్రహం ఆవిష్కరణకు నిరసనగా ప్రతిపక్షం వాకౌట్.

26. రైల్వే బడ్జెట్.

27. ఆర్థిక సర్వే సమర్పణ.

మధ్యప్రదేశ్ భోజ్ శాలలో ఇరుమతాలకు అనుమతి - కేంద్రం రాజీ సలహా.

27. గోధ్రా రైలు దుర్ఘటన జరిగి ఏడాది పూర్తి - దర్యాప్తు ఇంకా కొనసాగింపు.

28. కేంద్ర బడ్జెట్ ప్రతిపాదన.

పెంటగన్ తుంటరులు

మహాకవి శ్రీశ్రీ అమెరికన్ ప్రభుత్వాల యుద్ధ నీతిని, దాన్ని నడిపించే నాయకత్వాన్ని చాలా చక్కగా నిర్వహించారు. వారిని ఋణం ఇచ్చి రణం తెచ్చే 'పెంటగన్ తుంటర్లు' అని అన్నారు. మచ్చుకు ఆ తుంటరితనాన్ని పరిశీలించండి.

ప్రముఖ అమెరికన్ దిన పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ మార్చి 10వ తేదీన ఓ వార్త ప్రచురించింది. రాబోయే ఇరాన్ యుద్ధంలో నాశనం కాబోయే ఇరాక్‌లో పునర్నిర్మాణ పనులు చేపట్టడానికి గాను అమెరికా ప్రభుత్వం 900 మిలియన్ డాలర్ల (4500 కోట్ల రూపాయలు) విలువగల కాంట్రాక్ట్ పనులు కొన్ని ప్రముఖ అమెరికన్ కంపెనీలకు అప్పగించబోతోంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం జర్మనీ, జపాన్‌లలో పునర్నిర్మాణానికి అమెరికా అందించిన సహాయం తర్వాత ఇదే పెద్ద మొత్తం.

యు. ఎస్.ఎయిడ్ అమెరికాలోని కనీసం అయిదు ఇంజనీరింగ్ - ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలకు ఇటువంటి పనులు చేపట్టడానికి తమ ఆఫర్లని పంపమని కోరినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ తెలియజేసింది.

- మూలం : ఎకనమిక్ టైమ్స్ 11.03.2003

బ్లిక్స్‌పై అమెరికా, బ్రిటన్ల ట్రిక్స్

ఐక్యరాజ్యసమితి ఆయుధ తనిఖీదారుల బ్లిక్స్‌ను అమెరికా, బ్రిటన్లు విపరీతమయిన ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఎలాగయినా కాని ఇరాక్‌లో అతని ఆయుధ తనిఖీలో ప్రమాద కరమైన చోదకుడు లేకుండా నడిచే ఎయిర్‌క్రాఫ్ట్, ఇంకా ఇతర ప్రమాదకర ఆయుధాలు ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి ముందు వెల్లడించమని బ్లిక్స్‌పై రకరకాల ఒత్తిడి చేస్తున్నట్లు 10వ తేదీన లండన్ టైమ్స్ దినపత్రిక ఓ ప్రముఖమైన వార్త ప్రచురించింది. ఆ రకంగా ఐక్యరాజ్యసమితిలో ఇరాక్‌పై యుద్ధానికి అమెరికా, బ్రిటన్‌ల వాదనకు ఆమోదం పొందాలని చూస్తున్నాయి.

- మూలం : ఎకనమిక్ టైమ్స్ 10.03.2003



అంతర్జాతీయ ద్రవ్య నిధి అప్పులతో కుంగిపోయి అర్జంటీనా ప్రజల జీవితం దుర్భరమైంది. తిరగబడిన ప్రజలు ఎక్కడికక్కడ ప్రాంతీయంగా సంఘటితపడి పోటీ ప్రభుత్వాల లాగా నడుపుతున్నారు. వారి మధ్య లావాదేవీల కోసం ప్రజలే వేసుకున్న కరెన్సీ నమూనా ఇది. ఒక ప్రాంత గ్రామీణ ప్రజలు వేసుకున్నది. ఐ.యం.ఎఫ్ అప్పుతో దివాలా తీసిన దేశ కరెన్సీ పెసోను వారు నిరాకరిస్తున్నారు.

తమ శ్రమకు ప్రతిఫలాన్ని తామే వేసుకున్న ఈ కరెన్సీతో చెల్లించి చలామణి చేసుకుంటున్నారు. ఈ కరెన్సీకి సారా అమ్మరాదని నిషేధించారు. ఆ కరెన్సీలో తప్ప శ్రమకు ప్రతిఫలం ఆమో దించరు. ఆ విధంగా తమ శ్రమ ఫలితాన్ని సారాకు ధారబోసే పాత పురుషుల అలవాట్లకు స్వస్తి చెప్పించారు.

ఆ దేశంలో ఏర్పడుతున్న ఈ స్థానిక అనధికార యంత్రాంగాన్ని రష్యాలో విప్లవానికి ముందు ఏర్పడిన సోవియట్లతో పోలుస్తున్నారు.

వచ్చే సంచికలో...... ☆ అయోధ్య - రాజకీయ ఎత్తుగడలు